చిన్న నవల

అల్పజీవి

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

★

(గత సంచిక తరువాయి)

4

అంతకుముందెన్నడూ తన కంత పరపతి ఉన్నదనుకోలేదు సుబ్బయ్య.

తనలాంటి వాడు గవరయ్య అంతటివాణ్ణి అలా అడగ్గలగడం, అడగ్గానే అతను అడిగినంతా కిక్కురుమనకుండా ఇవ్వడం సంభవమౌతుందనుకోలేదు సుబ్బయ్య.

అంత సులభంగా అంతా జరిగినందుకు చాలా గర్వించేడు సుబ్బయ్య.

మరునాటి ఉదయం కాఫీ తాగి, సిగరెట్టు కాలుస్తూ వీధి వరండాలో కూర్చున్నప్పుడు అతని కంటికి ఎర్రచీరమనిషి సంతోషంగా ఉన్నట్టు కనిపించింది.

మొగుడు కాని త్వరలోనే వస్తున్నానని ఆఖరికి ఉత్తరం రాసేడేమో? కొడుకు జబ్బు పూర్తిగా పోయిందో? లేక రెండు జరిగేయో?

ఏమో, పాపం!

మునీశ్వర్లవారు ఇంకా రాలేదే? ఏం చెప్మా!

లేడీడాక్టరు రోజూ కన్న వేగిరం బయల్దేరింది.

ఈవిడకి పెళ్ళవలేదా? లేక విడోనా? డ్రైవరు పక్కనే ఎందు కూర్చుంటుంది?

ఎందు కూర్చోకూడదు?

సొట్టవాడప్పుడే బజారుకి పోయి వస్తున్నాడు.

వీడికి పసుచుపెళ్ళాం ఉన్నదనుకుంటాను. కోడిమాంసం అంటే చెవికోసుకొంటుంది. మనిషి ఎలా ఉంటుందో? బావుంటుంది...

ఆ నల్లచీర కట్టుకున్నది ఎవరో?

అబ్బ! ఎంత తెల్లగా ఉంది!!

తెల్లటిదానికి నల్ల మొగుడే దొరుకుతాడు. ఈవిడ మొగుడు మసిబొగ్గులా ఉంటాడనుకుంటాను. ఎలాంటి దానికి అలాంటివాడు ఎప్పుడూ దొరకడు. నిజం అంతే.

సావిత్రి ఎంత బావుంటుంది! నేనెలా ఉంటాను?!

అంతే!

ఏమిటో దేముడు అలా కూర్చుతాడు!

సావిత్రి చాలా బావుంటుంది...ఆవిడంత తెల్లగా ఉంటుందా? ఏమో! కాని బావుంటుంది... నాలా ఉండదు...కమల నాలాగే ఉంటుంది... అందుకే సావిత్రికి దాన్ని చూస్తే ఇష్టంలేదు...కన్నతల్లికూడా అలా ఉంటుందా?...అన్నీ నా అనుమానాలే...క్రిష్ణుడు తల్లినీ మాఁవఁనీ పోలేడు... వాడూ ఓ జమీందారవుతే...జాతకం బావుందన్నాడు పాలకొండ శాస్త్రిలు...ఆవిడే ఎదటింటికి ఎందుకు వెళ్తోంది...చాలా తెల్లగా ఉంది...

నల్లగా చీర...కళ్లు బాగున్నాయి...చిన్నవి...పెళ్ళయిందో లేదో...అప్పుడే నల్లగా ఉంటాడనేస్తున్నాను...కిల్లీకొట్టు ఇప్పుడేనా తెరిచేడు...పక్కింటి వాళ్ళమ్మాయి తయారు...అబ్బెబ్బే లాభం లేదు...తల్లీ తండ్రీ అదమాయింపులో ఉంటేనా...సోడాలు, లైమ్ జూస్‌లు, అలా తాగుతూనే ఉంటుంది...వాడు డబ్బులు పుచ్చుకోడు...ఈడొచ్చిన అమ్మాయే...పైటమాత్రం వేసుకోదు...సిగ్గులేకపోతే సరి...కిల్లీ కొట్టువాడు మంచివాడు కాడు...నల్లచీరావిడ...ఎందుకు వెళ్లింది...బావుంది...చాలా...కమలా క్రిష్ణుడూ పుస్తకాలు పట్టుకొని వీధిలోకి వచ్చేరు.

"ఏంరా క్రిష్ణా! ఇవాళ ఆలస్యంగా వెళ్తున్నారేం?"

"ఫరవాలేదు నాన్నా! మేష్టరేమీ అనర్లే"

నే వేసిన ప్రశ్నేమిటి? వాడి సమాధానమేమిటి?...మేష్టరేమీ అనర్లే...డాబూ దర్జా ధీమా...మేనమామ పోలికే అంతా...కమలకి నాలాగే భయం...పాపం...ఎప్పుడూ వాడికి వెనకే నడుస్తుంది...అదేమిటో...

క్రిష్ణుడు తోలుసంచీ భుజాన్న వేసుకొని అటూ ఇటూ చూసూ ముందు నడుస్తున్నాడు. క్రిష్ణుడికి తొమ్మిదోఏడు. చురుగ్గా కన్పిస్తాడు. ఉంగరాల జుత్తు; పొడవు ముక్కు; పెద్దకళ్ళు; కుర్రవాడిలో వెంకట్రావు పోలిక కొంత లేకపోలేదు.

కమల పీలగా ఉంటుంది. నెమ్మదిగా మాట్లాడుతుంది. చూడ్డానికి పదకొండేళ్ళ పిల్లలా ఉండదు. క్రిష్ణుడికన్న ఆమె వయసులో పెద్దయినప్పటికీ ఆమె తనకన్న చిన్నదాన్లాగ వ్యవహరిస్తాడు క్రిష్ణుడు.

ముందు తమ్ముడు, వెనక అక్కా నడుస్తూ స్కూలుకి వెళ్తున్నారు.

వెళ్తూన్న వాళ్ళని చూస్తూ తండ్రి చాలా సంతోషించేడు.

"నాన్న ఉంటే ఎంత బావుణ్ణు!"

పాపం! నాన్న!

రోజూ నన్ను స్కూలుకి దిగబెట్టేవాడు!

వీళ్ళని చూసి ఎంత సంతోషించునో!

ఏమిటో ఈ జీవితం?!

నాన్న ఎక్కడున్నాడో?

స్వర్గాన్న ఉన్నాడు!

నేనుమాత్రం ఎన్నాళ్ళుంటాను?

కొన్నాళ్ళు!

తరువాత?

"నాన్న ఎక్కడున్నాడో?"

అనుకుంటారు కమలా, క్రిష్ణుడూ!

ఏమిటో ఈ జీవితం?!

నాన్న చచ్చిపోయేడు!

నేను బ్రతికున్నాను!

నేను చచ్చిపోతాను!

కమలా క్రిష్ణుడూ బ్రతికుంటారు!

వాళ్లు......

ఛా! పొద్దుటే ఏమిటీ పాడు ఆలోచన్లు!

...ఇహ లేస్తాను...స్నానం చెయ్యాలి...వేణ్ణీళ్ళు ఉన్నాయో లేవో...భోజనం చెయ్యాలి...వంటయిందో లేదో...ఏం కూర చేసిందో ఈపూట...వెధవకూరలు...అన్నీ ప్రియంవేఁ...భోంచేసి ఆఫీసుకి పోవాలి...వెధవాఫీసు...నా కాఫీసుకి వెళ్లాలని లేదు...తప్పుతుందా...తప్పదు...వెళ్ళవలసిందే...

మెల్లిగా లేచేడు సుబ్బయ్య.

వీధిలోకి చూసేడు.

ఆవిడ ఎదటింటి మెట్లు దిగుతోంది.

ఎవరీవిడ...అబ్బ...చాలా తెల్లగా ఉంది...ఎవరో ఈవిడ...నవ్వుతోంది...బాగుంది...బాగా నవ్వుతోంది...మేష్టర్ చుట్టమో ఏమిటో...

అని ఇంట్లోకి వెళ్ళబోతూ ఆగిపోయిన సుబ్బయ్య అనుకున్నాడు.

ఎదటింటి మెట్లు దిగుతూన్న ఆడమనిషి నల్లటి చీరకట్టుకొంది. ఆవిడ తెల్లగా మెరిసిపోతోంది ఎండలో.

ఆవిడ కళ్ళు పెద్దవికావు. కాని కనురెప్పలు

మాటిమాటికీ రాల్చి, అప్పుడప్పుడు కళ్ళు తేల్చి చూస్తోంది, ఆమె.

ఆవిడ జుత్తు పొడవుకాదు. కాని నొక్కులుగా ఉంది. చెదురుతోంది.

ఆవిడ ముక్కు పొట్టిది కాదు. కాని కొంచెం మొద్దుగా ఉంది.

ఆవిడ నోరు వెడల్పుకాదు. కాని పెదవులు కాస్త దళసరిగా ఉన్నాయి.

ఆవిడ శరీరం సన్నంకాదు. కాని ఆరోగ్యంగా ఉంది, లావుగా ఉన్నా.

ఆవిల్లో మోటుతనం లేదు. ఆవిడ చూపులో కరకుతనం లేదు. ఆవిడ వంటిమీద ఆభరణాల్లేవు. ఆవిడ తన వంపుల్ని అంతగా దాచుకోడం లేదు.

పరిచయం లేని మొగవాళ్ళు ఆవిళ్ళాంటి ఆడవాళ్ళని పలకరించడానికి సందేహించరు.

పరాయి మొగవాళ్ళతో చనవుగా ఉండడానికి సందేహించే మనిషిలా ఆవిడ అగుపించదు.

ఆదినం ఉదయం "ఈవిడెవరో" అనుకొంటూ ఆవిణ్ణి చూస్తూ నిల్చున్న సుబ్బయ్యని చూస్తూ ఆవిడ అడిగింది.

"ఏమండీ! 'టైమ్' ఎంతయిందండీ"

అది మాత్రం అడిగింది ఆవిడ.

అది ఆవిడ అడిగినందుకు అపరప్రవరుడిలాగ అమితంగా గాభరా పడ్డాడు సుబ్బయ్య.

వీధిలో అందరుండగా నన్నే అడగాలా?

నన్నే ఎందు కడిగింది?

సుబ్బయ్య చెడ్డ గాభరా పడ్డాడు.

ఆట్టే వెడల్పుగా లేని రోడ్డు అడ్డుగా దాటి సుబ్బయ్యకి దగ్గరగా వచ్చిం దావిడ.

ఇంట్లోకి పోదాం అని నిశ్చయం చేసుకున్నాడు సుబ్బయ్య.

ఉద్దేశాన్ని ఆచరణలో మాత్రం పెట్టలేక పోయేడు.

ఎవ రీవిడ? ఎందుకువచ్చింది ఎదురింటికి? ఈమెకు ఇంత తెలుపు ఎక్కణ్ణించి వచ్చింది?మాటలో పడమటియాస ఉందా లేదా? ఎవరో ఎరగని నన్ను చూసి టైమ్ అడగడంలో ఉద్దేశం ఏమిటి? ఎదురుగా నిల్చొని పైట సర్దుకోకపోడంలో అభిప్రాయం ఏమిటి? కొంపతీసి...కోతి వెధవని...ఈవిడకి ముప్ఫయ్యేళ్ళుండవచ్చు...పెళ్ళయి వుంటుంది...కాకపోతే?...బావుణ్ణు...నాకెందుకు అయినా?... మనిషి బాగుంది...బాగుంటే నాకేం...మంచి మనిషిలా అవుపి...స్తోందా?...అయినా నాకెందుకు?... రెప్పలు పోగ్గా రాలుస్తోంది...పైట సర్దుకుంటే... బావుండదేమో...

ఒక్క క్షణంలో రకరకాల భావాలు, పరిగత్తేయి సుబ్బయ్య మనసులో.

ఆవిడ మళ్ళీ అడిగింది!

"ఏమండీ గంటెంతయిందో చెప్పగలరా?"

సుబ్బయ్య చేతిని వాచీ లేదు.

"ఇంట్లో...ఇంట్లోకి వెళ్లి చూసి చెప్తానుండండి" అని తొట్రుపాటుతో అన్నాడు.

ఆవిడ నవ్వింది.

ఎందుకు నవ్వింది? నన్ను చూసి కాదుకద? వెటకారపు నవ్వు కాదుకద?

నవ్వితే బావుంది.

బుగ్గ చిల్లు బావుంది.

"సరేనండీ" అన్న దామె.

తొందరగా ఇంట్లోకి వెళ్ళేడు సుబ్బయ్య.

గదిలో గడియారం ఏడుగంట లయినట్టు చూపెడుతోంది.

ఇంకా ఏడుగంటలేనా అయింది!

లేదు లేదు. గడియారం ఆగిపోయింది.

సుబ్బయ్య చాలా చిరాకు పడ్డాడు.

గంట తెలుసుకుందికి వీధిలో అందమైన ఆడమనిషి నిల్చుంది.

గదిలో ఉన్న గడియారపుముల్లు గదిలో నిల్చుండిపోయేయి.

వీధి వసారాలోకి వచ్చి రాని నవ్వు తెచ్చుకున్నాడు సుబ్బయ్య.

"గడియారం ఆగిపోయుందండీ। కాని...కాని ఇప్పుడు ఎనిమిదిన్నర అవుతుం దనుకుంటానండీ" అన్నాడు. సరియైన 'టైమ్' తెలుసుకొందికి, పాపం, ఆవిడకి ఏంపనుందో, ఏమిటో?

"అయ్యో!...పోనీలెండి" అని కదలబోయింది ఆవిడ.

అయ్యో! వెళిపోతోందే!

ఈవిణ్ణి ఆపుదామని ఎందు కంత ఆత్రతగా ఉంది నాకు?

అయ్యో! వెళిపోతోందే!

"సందు చివర్ని హోటేల్లో ఎంత టైమయిందో చూసి వస్తానుండండీ" అన్నాడు ఆత్రంతో.

"అక్కర్లేదండీ! అలాగే వెళ్తున్నా న్నేను"

ఆవిడ కంఠం చాలా ఇంపుగా ఉంది.

ఆవిడ నవ్వు చాలా సొంపుగా ఉంది.

ఆవిడ కదలింది.

అయ్యో! వెళిపోతోంది!

వెళిపోతోంది!!

ఎలా ఆపడం ఈవిణ్ణి?? +!!! +?? +!!

అతితీవ్రంగా అరక్షణం ఆలోచించేడు.

"ఏం?...తొందరగా స్టేషన్కి ఎక్కడకైనా వెళ్లాలా?"

ఆమాటతో ఆవిడ ఆగింది.

హమ్మయ్య! ఆగింది!

"లేదండీ"

అన్నదేకాని ఎక్కడికి వెళ్లాలో చెప్పలేదు.

చెప్పలేదుకాని అక్కడే నిల్చోంది.

ఆవి డెవరో తెలుసుకోవాలనే ఆదుర్దా జాస్తీ అయింది సుబ్బయ్యకి.

"ఎదటింటివారు మీకేమైనా అవుతారా?" అని అడగ్గలిగేడు.

ఎన్నడూ ఎరగని ఆడమనిషిని ఎండలో నిల్చోబెట్టి ఆవిడ పుట్టుపూర్వోత్తరాలగురించి, సంబంధ బాంధవ్యాల గురించీ, ప్రశ్నించడం, పెద్దమనిషి తరహా కాదని సుబ్బయ్యకి గుర్తు రాలేదు ఆ సమయంలో.

"ఏమవుతారంటారా? ఆయన మాస్టరూ, నేను మిస్ట్రెస్నీ" అని కొంటెగా నవ్విం దావిడ.

నవ్వేక అన్నది: "ఆయనకి జ్వరంగా ఉంటే చూసిపోదామని వచ్చేను. అంతే"

ఎదటింటిమాస్టర్ కి జ్వరం వచ్చిందికదా అని చింతించే అవస్థలోనూ లేడు, ఆవిడ ఎందుకునవ్విందా అని ఆలోచించే అవస్థలోనూ లేడు సుబ్బయ్య.

నవ్వినప్పుడు ఎంతో బావుంది అని మనసులో మళ్ళీ "నోట్" చేసుకున్నాడు.

"అయితే మీరు భారతీ విద్యాలయంలో పని చేస్తున్నారా?"

"అవునండీ"

"స్కూల్లో ఇదివర కెవరూ ఆడటీచర్లు లేరే"

"అవునండీ, ఈయేడే వేసేరు. నేను వచ్చి అంతా రెండుమాసాలయింది, ఈవూరు"

"ఆహాఁ! అలా చెప్పండి. అయితే...అయితే మీది ఈవూరు కాదా ఏమిటి?"

"కాదండీ, మాది ఏలూరు"

"అబ్బ! అంతదూరంనుంచి వచ్చేరాండీ?!"

"ఏంచెయ్యడమండీ పొట్టకోసం ఎంతదూరమైనా పోవాలి కద!"

అయ్యో! పాపం! బీదవాళ్ళు

ఈవిడకి పెళ్ళయిందో లేదో!

పెళ్ళవుతే ఇలా అవస్థపడుతుందా?

అయినా, ఎలా అడిగి తెలుసుకోడం?

"ఏక్లాసుకి చెప్తారండీ పాఠాలు?"

అన్నట్టు కమల భారతీ విద్యాలయంలోనే చదువుతోంది. ఫస్ట్ఫారంకి వచ్చింది. ఈవిడ ఫస్టుఫారంకి పాఠాలు చెప్తే...

"చిన్నక్లాసులకి చెప్తానండీ. ఈయేడు ఫస్టుఫారం, సెకెండ్ఫారాలవాళ్ళకి ఇంగ్లీషూ, హిస్టరీ చెప్తున్నారండీ"

హమ్మయ్య!

"మాఅమ్మాయి ఫస్టుఫారమే చదువుతూందండీ. మీకు తెలుసునో లేదో" అన్నాడు సుబ్బయ్య సంతోషంతో.

"ఏంపేరండీ మీ అమ్మాయిది?"

"కమలండీ, కమల. పల్చగా తెల్లగా ఉంటుంది"

"కమలా?...ఆ. తెలుసునండీ, తెలుసు. తెలివైనపిల్లే (సుబ్బయ్య ముఖం వికసించింది)...అయితే మీ అమ్మాయి స్కూలుకు వెళ్ళిందా?"

"పావుగంటయిందండీ వెళ్ళి"

"అయితే స్కూలుకి వేళయివుంటుందండీ. టీచర్నయీ లేటుగా వెళ్తే బావుండదు. వెళ్ళి వస్తా.

వస్తా. మళ్లీ కలుసుకుందాం. మీ అమ్మాయిగురించి చూస్తూ ఉంటాలెండి. మరి నే వస్తా"

అని కొంచెం తొందరపాటుతో వెళ్లింది ఆవిడ.

మళ్ళీ కలుసుకుందాం...అబ్బ...అబ్బ!...

నడకకూడా అందంగా ఉంది ... హబ్బ ... హబ్బ...వెనకనుంచి చూసినా మనిషి బావుంది... అబ్బ...అబ్బ...కొంతదూరం వెళ్ళేక వెనక్కి తిరిగి చూసింది ఆవిడ.

వెనక్కి తిరిగిచూసి మందహాసం చేసింది.

ఆమె కట్టుకొన్న నల్లటిచీర ఎండలో ఇంకా నల్లగా అగుపిస్తోంది. ఆవిడవళ్లు దూరంనుంచి ఇంకా హెచ్చు తెల్లగా కనపడుతోంది. తొందరగా నడవడంలో ఆవిడ నడుం చాలా భారంగా కదుల్తోంది.

అవిణ్ణి చూస్తూ ఉంటే సుబ్బయ్య గుండెలు కట్టు తప్పి కొట్టుకుంటున్నాయి. అతని వళ్లు చెప్ప లేనంతగా వేడెక్కి వణికింది. మొదటిసారి మద్యం తాగినట్టు అతని తల తిరిగింది.

అతనికి నిషా ఎక్కింది.

ఆవిడ వెళ్తూ వెళ్తూ సందుచివర ఆగింది. హోటేల్లో టైమ్ చూసేక వెనక్కి తిరిగి మళ్ళీ చూసింది. తరువాత సందు మళ్ళింది.

అబ్బబ్బ! రెండుసార్లు వెనక్కి తిరిగిచూసింది.

రెండుసార్లు చూసింది.

చూసింది. కళ్లు రాల్చి చూసింది. కళ్లు తేల్చి చూసింది. తొలగిన పైట సర్దుకొంటూ చూసింది.

సుబ్బయ్య మతి మతిలో లేదు.

మొగవాళ్ళందరికీ ఉన్నట్టుగానే చిన్నతనంలో సుబ్బయ్యకి ఆడవాళ్ళని ఆకర్షించాలనే అభిలాష ఉండేది.

ఒకప్పుడు తనకా అభిలాష ఉండేదనికూడా తరువాత దినాల్లో మర్చిపోయేడు.

కాని ఆరోజు ఉదయం ఆవిడతో తను మాట్లాడినందుకు పెళ్ళికొడుకులా సంబరపడ్డాడు సుబ్బయ్య.

అతనికి అతి ఉత్సాహం కలిగింది.

అతనికి తెలియని వాంఛలతో అతని మనసు చలించింది.

ఆవిడ వీధి మలుపు తిరిగి పోయిన తరువాత సుబ్బయ్య ఇంట్లోకి వెళ్ళేడు.

స్నానం చేసేడు. భోజనం చేస్తున్నాడు.

వడ్డించుకొని భోజనం చేస్తున్నాడు.

సావిత్రి అతని కెప్పుడూ వడ్డించదు. వంట చేసి, అన్నీ సిద్ధంచేసి ఆమె తన గదిలోకి పోతుంది.

"నేనామెకి తగను. నిజమే. కాని భర్తనికదా· నామీద కొంచెమైనా గౌరవం ఉంచకూడదా"అని కించపడుతూ ఉంటాడు సుబ్బయ్య.

ఆపూటమాత్రం సావిత్రి తనపక్కన కూర్చొని వడ్డించనందుకు విచారించలేదతను.

సావిత్రి ఉన్నప్పుడు ఏ ఆలోచనా తోచదతనికి.

సావిత్రి ఎదురుగా ఉంటే నల్లచీరావిడ అతని మనసులోంచి తొలగిపోయుండును.

సావిత్రి అతనికి ఎదురుగా లేదు.

ఎదురుగాలేని నల్లచీరావిడ అతని మనసంతా ఆక్రమించింది.

అతని ఆలోచనలన్నీ నల్లచీరావిడ చుట్టూ తిరుగుతున్నాయి.

ఆవిడ ప్రధాన పాత్రగా అనేకనాటకరంగాలు అతనికళ్ళముందు కదలిపోతున్నాయి.

అనేక కథల్తో అతని కోరికలు చెలరేగుతున్నాయి.

అనేక కోరికల్తో అతని కథలు నిండుకుంటున్నాయి.

ఆవిడకి పెళ్ళయిందా?

అయింది! ఆమె భర్త ఇక్కడెక్కడా లేడు. పరలోకానికి అర్జంటుగా వెళిపోయేడు. మొదట్లో ఆవిడ చాలా ఏడ్చింది. తరువాత బ్రతుకు తెరువు చూసుకొందికి ముందు స్కూల్లో ప్రవేశించి చదువుకొంది. "నన్నెవ్వరూ పోషించనక్కర్లేదు. నాపొట్ట నేను పోషించుకోగలను" అన్నాది. అలాగే సాధించింది. తన జీవితాన్ని తనే భరిస్తోంది. "నాకు భర్త అక్కర్లేదు" అన్నాది. మళ్ళీ పెళ్ళిచేసుకోదల్చుకో లేదావిడ. చేసుకుందామనుకున్నప్పటికీ ఆమెకినచ్చిన వాళ్ళెవరూ లేరు.

కాని—

భగవంతుడు సుబ్బయ్యనేవాణ్ణి సృష్టించేడు.

ఆ సంగతి ఈరోజే తెలిసింది ఆడవికి.

ఆవిడకి పెళ్ళయిందా?

అవలేదు! "నేను పెళ్లి చేసుకోను. నాకు పెళ్ళక్కర్లేదు." అని భీష్మించుకూర్చుంది. మగ వాళ్ళంటే ఆవిడకి అసహ్యం. "ఆడవాళ్ళ బ్రతుకులు ఉద్ధరించడానికే నేను పుట్టేను" అంటుం దావిడ. పురుషుడన్న వాడి అపవిత్రపు హస్తం ఆవిడ వంటిని పడలే దింతవరకూ.

కాని—

ఈ రోజున సుబ్బయ్యని చూసింది ఆవిడ.

మగవాళ్ళగురించి ఆవిడ దృక్పథం మారింది. ఆవిడ మనసు చెదిరింది. ఆవిడ పైట తొలగింది.

ఆవిడకి స్నేహితులున్నారా?

ఉన్నారు! అనేకమంది. అంతా స్నేహితులే ఆవిడకి. అంతా కబుర్లు చెప్తూ తిరిగేవారే. అంతా ఒట్టి కబుర్లు చెప్పేవారే. అంతా ఆవిణ్ణి మోసపుచ్చే వారే. అంతటితో ఆవిడకి మానవులయందు నమ్మకం పోయింది.

కాని—

ఈరోజున సుబ్బయ్యతో మాట్లాడింది.

నిజంగా నిజమైన స్నేహం ఉన్నదనే నిజమైన నమ్మకం నిజంగా కలిగింది ఆవిడ్లో.

ఆవిడకి స్నేహితులున్నారా?

లేరు! ఆవిడకి స్నేహితుల్లేరు. ఆవిడ ఎవ్వరికీ స్నేహితురాలు కాదు. ఆవిడ ఒంటిపిల్లి రాకాసి. నమ్మినవాళ్ళనందర్నీ ఆవిడ ద్రోహం చేస్తుంది. ఆవిడ ఒక గోముఖ వ్యాఘ్రం. స్త్రీరూపంలోఉండే రాక్షసి.

కాని—

ఈరోజున సుబ్బయ్య ఆవిడకట్టెదుట నిల్చేడు.

రాక్షసి చచ్చింది.

సహజ శాంతమూర్తి స్త్రీమూర్తి నిల్చింది.

ఆవిడ కన్యేనా?

అవును. కాదు.

ఆవిడకన్యేనా?

కాదు. అవును.

ఆవిడ అందం ఒక్క ముఖంలోనే ఉందా?

అవును.

ఆవిడ అందం ఒక్క ముఖంతోనే ఆగిపోయిందా?

లేదు.

నీకు తెలుసునా?

తెలుసు.

ఎలా తెలుసు?

నాకంటికి ఎక్స్‌రేస్ ఉన్నయ్.

అయితే ఆవిడ కన్య అవునో కాదో ఎందుకు తెలుసుకోలేవు?

నాకు తెలుసునే.

నీకు తెలిసిన దేమిటి?

ఆవిడ కన్యకాని కన్య అనే విషయం నాకు తెలుసు.

నీకు పిచ్చెక్కింది. మతి చెడింది. వళ్లు తిప్పింది. తల తిరిగింది. కన్ను చెదిరింది.

ఆవిడే కన్యకాని కన్య.

నువ్వు నువ్వుకాని నువ్వు.

అర్థం ఉందా?

ఉంది. లేదు. ఉందికాని ఉంది. లేదుకాని లేదుంది దుందిలే...

"నిజంగా నాకు పిచ్చెత్తుతోంది"

అనుకున్నాడు సుబ్బయ్య ఆఫీసుకి నడుస్తూ.

పగలు పదిన్నరగంటలు దాటింది.

ఎండ జోరుగా ఉంది.

వేడి హెచ్చుగా ఉంది.

గాలి తక్కువగా ఉంది.

మోటారుకార్లు రేపిన దుమ్ము కిందికి గాలడం లేదు.

సదరుదుమ్ము ఇళ్ళల్లోకివస్తోంది; ముక్కులోకి పోతోంది. బట్టల్ని అంటుతోంది. చెమటతో కలుస్తోంది.

ఆఫీసు. చేరేసరికి పావుతక్కువ పదకొండయింది.

ఇంకా హెడ్ గుమాస్తా రాలేదు.

హెడ్ గుమాస్తాలు కొద్దిమంది వచ్చేరు.

సుబ్బయ్య తన కుర్చీకి కోటు తగిల్చి తన కుర్చీలో కూర్చున్నాడు.

వెధవాఫీసు!

ఈ వెధవ ఆఫీసులో నేను.

ఆ వెధవ స్కూల్లో ఆవిడ.

దూరదూరంగా ఉండీ ఒకే అవస్థలో ఉన్నాం.

ఎక్కడో ఎప్పుడో ఆవిడకీ నాకూ సంబంధం ఉంది.

అదంతా ఒక గుట్టు.

ఆమెకీ నాకూ ఈరోజువరకూ తెలియని గుట్టు.

ఈరోజు బైట పడింది.

నేనూ ఆవిడా.

ఆవిడా నేనూ.

ఆదినుండీ నాకోసమే ఉన్న ఆడది,

అనేక జన్మల్లో అనేక వేషాల్తో వస్తోంది.

ఈరోజు నల్ల చీరతో వచ్చింది.

రేపు......

"ఏదయ్యా సుబ్బన్నా, ముందు ఇలా ఓ సిగరెట్టిచ్చుకొని, తరువాత నే నడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పు"

సుబ్బయ్య త్రుళ్లిపడ్డాడు.

ఎదురుగాఉన్న గడియారంలో పది నిమిషాలు తక్కువగా పదకొండయింది, చూసేవాళ్ళకి.

సుబ్బయ్య ఆయొక్క గడియారంవైపు చూడ లేదు.

సుబ్బయ్యకీ గడియారానికీ మధ్య అవధాని తాలూకు బట్టతల, మెల్లకన్ను, బండముక్కు, దాక నోరు వగైరాలన్నీ అడ్డొచ్చాయి.

సుబ్బయ్య ఇచ్చిన సిగరెట్టు సుబ్బయ్య ఇచ్చిన అగ్గిపుల్లతో అంటించి సుబ్బయ్యముఖంమీదకి పొగ వదుల్తూ అడిగేడు అవధాని.

"నిన్న మధ్యాహ్నం గవరయ్యతో ఏమిటోయ్ మాట్లాడుతున్నావూ?"

తెలివిలేని సుబ్బయ్యకి ఒక్కసారిగా తెలివొచ్చింది.

"ఏమిటి మాట్లాడుతున్నాను? ఎవరితో?"

"ఇప్పుడు నాతో మాట్లాడుతున్నావ్! ఇప్పటి సంగతి కాదు అడిగేది నేను. నిన్న గవరయ్యతో ఏమిటి మాట్లాడేవు?"

"ఏమీ మాట్లాడలేదే!"

అబద్ధం ఆడుతున్నాను.

ఎందుకు?

ఏమో! నాకు భయంగా ఉంది.

అవధాని దమ్ము లాగేడు. పొగ వదిలేడు.

"సుబ్బన్నా! నేనోమాట చెప్తా విను. ఈఆఫీసు మంచిదికాదు. ఆఫీస్ స్టాఫ్ మంచిది కాదు. హెడ్ క్లార్కు మంచివాడని వాడూ అనడు. నేనూ అనను. గవరయ్య అందర్నీ మించిపోయి వున్నాడు...ఇహ. నువ్వుచూస్తే ఓ వెర్రిపీరువి. అందుచేతా, భాయీ! జాగ్రత్తగా మసులుకో. బోధపడిందా!"

సుబ్బయ్యకి సరిగ్గా బోధపడలేదు.

కాని అమితంగా భయం కలిగింది.

హెడ్ క్లార్కు...గవరయ్య...అయిదువందలు నేను...బిల్సే...అయిదువందలు ... గవరయ్య బిల్సే నేను...

భయం ఉప్పెనగా వచ్చి సుబ్బయ్యని ముంచేసింది.

అతని మనసులోంచి నల్లచీరావిడ సన్నసన్నగా వెనక్కిపోయింది.

నల్లచీరావిడ వెనక్కి వెనక్కి తిరిగి తిరిగి చూడకుండా అదేపోవడం పోయింది.

నల్లగా, నల్లనల్లగా, కటికచీకట్లో, కారుమబ్బుల్లో సుబ్బయ్య...

హబ్బా! ఈ సుబ్బయ్యకి గుండె నిబ్బరం పోయింది.

"జాగ్రత్తగా మసులుకో, బోధపడిందా?"

మెల్లకన్నుతో చూసి, సుబ్బయ్య భుజం తట్టి, తరువాత తనసీట్లో కూర్చున్నాడు అవధాని.

గోడమీద గడియారంలో పదకొండు గంటలయింది, చూసేవాళ్ళకి.

సుబ్బయ్య గడియారంవైపు చూడ్డంలేదు.

అతని కళ్ళు చీకట్లు కమ్మేయి.

అతనిగుండెలు అగాధంలోకి దిగిపోతున్నాయి. జారిపోతున్నాయి.

దిగజారిపోతున్నాయి.

5

ఆరోజున ఆఫీసులో ఏపనీ చెయ్యలేకపోయేడు సుబ్బయ్య.

లెక్కలు కూడుతూఉంటే అన్నీ తప్పులే వస్తున్నాయి.

పదహారు పైసలు...అణాపోతే...పన్నెండు పోతే...

అయిదువందలూ నాకోసం పుచ్చుకో లేదే!

పాపం, వెంకట్రావుకి అవసరంవచ్చి అడిగేడు.

మళ్ళీ గవరయ్యకి ఇచ్చెయ్యనూ!

వెంకట్రావు పెద్దమనిషి, జమీందార్ కొడుకు. గొప్ప వంశం.

తప్పకుండా ఇచ్చేస్తాడు.

పదహారు...అణాపోతే నాలుగు...ఒకటీ మూడు నాలుగూ పదిహేను పంథొమ్మిది...పదహారుపోతే మూడు...ఒకటీ నాలుగు అయిదూ నలభై నలభైఅయిదు వందలూ అయిదు...

"ఏం సుబ్బయ్యా! గవరయ్యబిల్సన్నీ పూర్తి చేసేవా?"

హెడ్ క్లార్కు కంఠం అది.

"ఏమిటండీ ఏమిటి?"

"గవరయ్య బిల్స్ చెకింగ్ పూర్తయిందా???"

హెడ్ క్లార్కు కర్కశ కంఠం అది.

"ఇంకా లేదండీ"

"నువ్వెక్కడ చేస్తావ్?! ఇంత వేగిరం అయిపోతే ఇంకేమి టుంటుంది నీకు...వర్కు"

సుబ్బయ్య గుండె బద్దలయిపోతోంది.

తప్పదు! బద్దలయిపోతోంది!

"ఇంకా వర్కు కొత్త కదండీ. కొంచెం ఆలస్యం అవుతుంది ఎలానూ మరి" అని అవధాని అన్నాడు.

"ఆ, అలా నేం? ఆలస్యం అవుతుందా? నాకు తెలుసునండీ అవధానిగారూ! ఇంకా ఆలస్యం అవుతుంది." అని వెటకారంగా నవ్వి, కొమ్ముడబ్బీలోంచి ముక్కుపొడుం తీసి ముక్కులోకి ఒట్టించేడు హెడ్ గుమాస్తా.

పదహారూ...పది...పదహారూ నాలుగు పదహారూ ఆరు పదహారూ ఎనిమిది పదహారూ...

సుబ్బయ్య తల బద్దలవుతోంది.

తప్పదు! సుబ్బయ్య తల బద్దలయిపోతోంది.

సుబ్బయ్య సాయంకాలం ఇంటికి వెళ్తూనే ఉన్నాడు.

రోడ్డుమీద పోయే జనం రోజూలాగ పోతూనే ఉన్నారు.

రోడ్డుమీద రోజూలాగ పోతూన్న సుబ్బయ్య తలలో జట్కాలు, రిక్షాలు, మోటార్లు, విమానాలు, రైళ్లు, పరిగెడుతున్నాయి. ఎగురుతున్నాయి. గుద్దుకొంటున్నాయి.

ఆఫీసువెలుపల టీదుకాణం ప్రొప్రయిటరు ఎర్రగళ్ళ లుంగీ కట్టుకొని, బీడీ కాలుస్తూ 'టీ' కలుపుతున్నాడు. 'ఉడిపి' హోటేల్ ముందు ఎప్పుడూ చూడని కొత్తకారు ఆగింది. 'ప్రేమ' సినీమాకి అందర్నీ పూర్ణాకి రమ్మని లౌడ్ స్పీకర్స్ ఆహ్వనిస్తున్నాయి. ముగ్గురు పిల్లలూ, ఇద్దరు పెద్దవాళ్ళూ ఐస్ ఫ్రూట్ తింటున్నారు. ఒక పిల్లడి మంచుముక్క మన్నులో పడింది. సైకిల్ విరొంచి ఒకడు పడబోయి పడలేదు. సిల్కు సూటు వేసుకున్న సప్లయ్ఆఫీసు గుమాస్తా రోడ్డుకి కాండ్రించి ఉమ్మేడు. కిళ్లీ దుకాణం దగ్గర నిల్చున్న ఆసామీ కాణీ లేద్దామా అర్ధణా వేద్దామా అని అరనిమిషం ఆలోచించి ముష్టి వాడికి అర్ధణా వేసేడు కాణీ కనపడక. రాత్రివేళ కనిపించే సిల్కుజాకెట్టు పిల్ల లైట్ హవుస్ వైపుకి సాయంకాలమే పనయం సాగించింది. సందుచివర్న రిక్షా పడిపోయింది. దెబ్బతగిలిన రిక్షావాడికి దెబ్బ తగలని పెద్దమనిషి డబ్బు లివ్వకుండా వెళిపోయేడు. బండీలో కూర్చొన్న బెంగాలీపిల్లవైపు కిరాణా కొట్టుదగ్గర కూర్చొన్న ఒడ్డిమంగలి నిగావేసి చూసేడు. బెంగాలీ పిల్ల కిళ్లీ నములుతూ షాపులోఉన్న రిబ్బన్లవైపు చూస్తోంది. "సరస్వతీ వాచకాలు ఎక్కడండీ దొరుకుతాయి" అని పదహారేళ్ల అమ్మాయి ఫస్ట్ఫారం తెలుగు పుస్తకం గురించి ఇంకొకర్ని అడుగుతోంది. "ఒక్క కాణీ ఇప్పించు నాయనా" అని షర్టులేని ముష్టివాడు వాణీ వేసుకొన్న సంగీతం మాస్టర్ని అడిగేడు. "ఒక రూపాయుంటే ఇద్దూ బావా" అని నీలిరవిక వేసుకొన్న వెలయాలు బొమ్మల షర్టు వేసుకొన్న విటకాణ్ణి సందు మలుపులో అడిగింది. "ముందు నాకో అర్ధరూపాయుంటే ఇయ్యి" అని అతగాడు అర్జంటుగా అడిగేడు ఆమెని. జనబాహుళ్యాన్ని పక్కకి తప్పుకోమని జట్కా వాడు హెచ్చరిస్తున్నాడు.

సుబ్బయ్య పక్కకి తప్పుకున్నాడు.

బాధపడుతున్నాడు.

భయపడుతున్నాడు.

పక్కకి తప్పుకు పోవాలి.

ఎక్కడకైనా తప్పించుకుపోతే బావుణ్ణు.

"జాగ్రత్తగా మసులుకో"

అయినా నేనేం తప్పుచేశాను?

అయిదు వందలు అడిగేను.

అడిగి పుచ్చుకున్నాను.

బ్రైబ్! పబ్లిక్ సర్వెంట్!

"సుబ్బయ్య లంచం పుచ్చుకున్నాడు!!"

ఇంకా పక్కకి, ఇంకా వెనక్కి, ఇంకా వారకి, ఇంకా చాటుకి పోవాలి, తప్పుకుపోవాలి.

ఎవరలా ధీమాగా నడుస్తున్నారు?

అంతా ధీమాగానే నడుస్తున్నారు!

నేనుకూడా ధీమాగా, ధైర్యంగా ఉండగలిగితే...

నాకు ధైర్యం లేదు.

భయం, భయం, భయం.

హెడ్ క్లార్కు చంపేస్తాడు.

పబ్లిక్ సర్వెంట్!

కోర్టెక్కితే జెయిల్!

జెయిలుకి పోతే...

ఇంకా వారకి, ఇంకా చాటుకి.

ఇంకా వారకి వెళ్తే

కాలవలో పడతాను.

సముద్రంలో పడతాను.

చస్తాను.

ఎవరలా దర్జాగా వెళ్తున్నారు?

తెలిసిన మొహమే!

నావైపు చూడ్డంలేదు.

ఎందుకు చూస్తాడు?

నే నెవరికీ కనపడను.

నేను దాగుంటాను.

నేను చచ్చిపోతాను.

"జాగ్రత్తగా మసులుకో!!"

నేనే తప్పూ చెయ్యలేదే!

"నేనో మాట చెప్తా, విను"

వింటాను. తప్పక వింటాను.

"జాగ్రత్తగా మసులుకో!!"

సరే, సరే!... కాని... నేనే పొరపాటూ...

అయినా సరే, భయంమీద ఉండాలి.

జాగ్రత్తగా మసలాలి.

లేకపోతే—

ఉద్యోగం బర్తరఫ్!

పిమ్మట కారాగారవాసం తథ్యం!!

అమ్మో! అమ్మో!

ఎందుకలా నవ్వుతున్నారు?

'బాజారే తిరిగిచూచి పక్కన నవ్వెన్'!

అంతా ఎందుకలా నవ్వుతున్నారు?

ఎందుకో? ఏమో?

అంతా నవ్వుతున్నారు. నవ్వుతారు. ఇంకా నవ్వుతారు!

గవరయ్యా, రామస్వామీకూడా నవ్వుతారు.

భయంకరంగా నవ్వుతారు.

జోరు జోరుగా నడిచి ఇంటికి చేరుకున్నాడు సుబ్బయ్య.

అరుగుమీద కూలబడ్డాడు.

సాయంత్రం ఆరుంపావయింది అప్పుడు.

కుడిచేతి కోటు చేత్తో ముఖంమీద చెమట తుడుచుకొంటూ ఉంటే కమల వెక్కి వెక్కి ఏడుస్తూ వీధి వరాండాలోకి వచ్చింది.

"నాన్నా! అమ్మ...అమ్మ...సి...సినీమాకి వెళ్లింది నాన్నా!"

కమల కళ్ళంట కన్నీరు కారుతోందని చూడకుండా చూసేడు సుబ్బయ్య.

"ఆహాఁ!"

"నన్ను తీ...తీసుకు పో...ళ్ళ లేదు నాన్నా!"

"ఆహాఁ!"

"త్హ...త్హమ్ముణ్ణి తీ...త్హీ...సుకు వెళ్లింది నాన్నా!"

"అయితే సరే"

"ఎప్పుడూ ఇంతే నాన్నా!"

కమలా కాంతుడు అస్తమిస్తున్నాడు.

కమలా కుమారి ఏడుస్తున్నాది.

"ఎందుకు కమలా ఏడుస్తున్నావు?"

"నే చెప్పే దెప్పుడూ వి...వినవు నాన్నా! న న్నెవ్వరూ చూడ్రు నాన్నా! నే నెవ్వరికీ... హక్కల్లేదు హ్నాన్నా!"

"ఏమిటమ్మా? ఎందుకూ ఏడుస్తున్నావ్?"

"అమ్మా తమ్ముడూ సినిమాకి వెళిపోయేరు నాన్నా"

అని బావురుమని ఏడ్చింది కమల.

అసందర్భంగా ఉంది! అసందర్భం! అసందర్భం!

అంతా అసందర్భంగా ఉంది!

డబ్బు పుచ్చుకొన్న వెంకట్రావు దర్జాగా నే ఉన్నాడు. పొడుం పీల్చే హెడ్ గుమాస్తా కంట్రాక్టర్ల దగ్గర డబ్బు పీల్చి ఇంకా దర్జాగా ఉన్నాడు. అడగ్గానే అయిదువందలిచ్చేడు గవరయ్య. అవధాని నేనిచ్చిన సిగరెట్టు కాల్చి కాల్చి పారేశాడు. ఎదటింటి మాస్టరు టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడు. పక్కింటి అమ్మాయి సోడాదుకాణం వాడితో సరసాలాడుతోంది. హార్బర్ ఇంజనీరు సరికొత్తకార్లో పందిలాంటి పాత పెళ్ళాన్ని ఊరేగిస్తున్నాడు. సావిత్రి "ప్రేమ" సినీమాక్కాబోలు వెళ్లింది. ప్రేమ సినీమాకి వెళ్ళనందుకు కమల వెక్కి వెక్కి ఏడ్చి యేడ్చి బిక్క చచ్చి నిల్చుంది. నేను ఏడవలేక నోరుమూసు కూర్చున్నాను.

అంతా అసందర్భం! అసందర్భం!

అసందర్భంగా లేదూ?

"ఇదిగో! అర్ధణా పట్టుకు పోయి ఏమైనా కొనుక్కో! ఏడవకమ్మా!" అన్నాడు సుబ్బయ్య కూతుర్ని బుజ్జగిస్తూ.

"అక్కర్లేదు నాన్నా! నాకక్కర్లేదు. అయిదురూపాయ లిచ్చినా అక్కర్లేదు నాన్నా!..."

"అయిదు" శబ్దం నన్ను వదల్దు కాబోలు.

నేనేం తప్పు చేశాను భగవంతుడా!

"...అమ్మ నన్నెందుకు, నాన్నా, సినీమాకి తీసుకువెళ్ళక పోవాలి?"

ఏమో? ఎవడెరుగును? కారణం ఎవడికి తెలుసు? దేనికైనా సరే కారణం ఎవడు చెప్ప గలడు? సినీమాకి నిన్ను తీసుకువెళ్ళకపోతే నీకు ఏడుపెందుకు వచ్చింది? నవ్వెందుకు రాలేదు? అయిదువంద లడిగి నేనెందుకు భయపడాలి? గవరయ్య లక్షాధికారి ఎందు కవాలి? రామస్వామి పొడుం ఎందుకు పీల్చాలి? అవధాని తల బట్టతలగా ఎందుకు మారాలి? అస లీలోకం అంతా ఎందు కిలా ఉండాలి?

సుబ్బయ్యకి నవ్వొచ్చింది. ఏడుపూ వచ్చింది.

కమల ఏడుస్తూనే ఉంది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావూ?"

అని అడిగినది సుబ్బయ్య కాదు.

అడిగిన దెవరు?

అడిగిన ఆసామీ అరుగుపక్క పొట్టిగా నిటారుగా నిల్చున్నాడు.

"ఎవరు నువ్వు"

అని అడిగినవాడు సుబ్బయ్య.

"నేనండి పోతన్నని. అయిదువందలూ నిన్ననే నేకదా పట్టుకువచ్చేను. మర్చిపోయేరా?"

అయిదు వందలు!!

అవునవును. అయిదువందలూ తెచ్చిన దితనే!

గవరయ్య నౌఖరు!!

భయం హెచ్చింది సుబ్బయ్యకి.

"మర్చిపోలేదు. మర్చిపోలేదు. చీకటిగా ఉంది కదూ. పోల్చుకోలేక పోయేను."

"చిత్తం"

నల్లగా, లావుగా, పొట్టిగా, సూదిముక్కుతో నిల్చున్న పోతన్న ఎందుకు వచ్చేడో తెలియక కలవరపడ్డాడు సుబ్బయ్య.

"ఏం...ఏం? ఇలా ఒచ్చేవ్?"

"ఇంటికి పోతున్నానండి. చిన్నమ్మగారేడుస్తూ ఉంటే ఆగేను"

అంతేనా!!

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్?" అని కమల నుద్దేశించి మళ్ళీ అడిగేడు పోతన్న.

ఆ ప్రశ్నకి ఏడుపు కట్టేసి ఊరుకొంది కమల.

"దీన్ని వదిలేసి వాళ్ళమ్మా తమ్ముడూ సినీమాకి వెళిపోయేరు. అందుకూ ఏడుస్తోంది" అని సుబ్బయ్య సమాధానం చెప్పేడు.

పోతన్న నవ్వుతూ అడిగేడు కమలని; "పోనీ నాతో షికారు వస్తావా? చిన్నమ్మా"

కమల ముఖం వికసించింది.

"వెళ్తానా నాన్నా!" అంది చేతులు ఊపుతూ.

"వెళ్ళు...కాని...ఎక్కడికి తీసుకు వెళ్తావోయ్" అన్నాడు సుబ్బయ్య కొంచెం సందేహిస్తూ.

"రావమ్మా, వెళ్దాం" అని కమలని పిల్చేడు పోతన్న, సుబ్బయ్యకి జవా బివ్వకుండా.

"సరే వెళ్లు" అన్నాడు సుబ్బయ్య కమలతో.

కమల మెట్లు దిగి పోతన్న చెయ్యి పట్టుకొంది.

ఇద్దరూ చేతులు పట్టుకొని బజారువెంబడి పోతున్నారు.

"వేగిరం వచ్చెయ్యాలి సుమా" అని కేకలేసేడు సుబ్బయ్య.

అలాగే అన్నట్టుగా చెయ్యివూపేడు పోతన్న.

సుబ్బయ్య ఆశ్చర్యపడ్డాడు. తనకి పోతన్నని చూడగానే భయం కలిగింది. కమల నిర్భయంగా అతనితో షికారు వెళ్తోంది, పిలవడమే తడవుగా.

కమలా పోతన్నా వెళ్ళిన తరువాత సుబ్బయ్య లేచి లోనికి వెళ్ళి కోటు విప్పేడు. కాళ్ళు కడుక్కొని, తుడుచుకొని, దుస్తులు మార్చుకున్నాడు. తిరిగి వీధి వసారాలోకి వచ్చి మామూలు జాగాలో కూర్చుని సిగరెట్టు అంటించేడు.

ఏడుగంటలు దాటింది.

ఎదటివారింటికి డాక్టరు వచ్చి వెళ్తున్నాడు. అతను పొడుగ్గా ఆరోగ్యంగా ఉన్నాడు. చేతిలో చిన్న తోలుపెట్టె, మెడలో స్టెథోస్కోపు, నోట్లో సిగరెట్టు. వీటితో వీధిలోకి వచ్చి నిల్చున్నాడు. అతని వెనక అరడజనుమంది నిల్చున్నారు ఆందోళనతో. టైఫాయిడ్‌తో బాధపడుతూన్న మాస్టర్ గారి తమ్ముడితో "ఇహ ఫర్వాలేదు, *HE HAS TURNED THE CORNER*" అన్నాడు డాక్టరు నోట్లోంచి సిగరెట్టు తియ్యకుండానే.

మనుష్యులకి జబ్బులెందుకు వస్తాయో? డాక్టర్లు చెప్పగలరా?

అనే విషయంగురించి ఆలోచించేడు సుబ్బయ.

ఎదటివారింటికి వచ్చిన డాక్టరు, ఎదటివారిచ్చిన ఫీజు పుచ్చుకొని ఎదటివారు రప్పించిన రిక్షా ఎక్కి వెళ్ళిపోయేడు.

నేనుకూడా డాక్టరీ చదువుతే ఎంత బావుణ్ణు!

వైద్యుల్ని అందరూ గౌరవిస్తారు. వాళ్ళని ఎక్కువగా చూస్తారు. వాళ్ళదగ్గర భయభక్తుల్తో ఉంటారు. వాళ్ళు చెప్పినట్టు నడుచుకుంటారు.

డాక్టర్లకి సంఘంలో మంచి మర్యాద.

నేను వైద్యం చదువుతే "డాక్టర్ సుబ్బయ్య" అని రాయించి బోర్డు పెట్టుకొందును.

నారాత ఇలా ఉండగా అలా ఎందుకవుతుంది?

నేనూ నా వెధవ ఆఫీసూ ఇలా ఉండవలసిందే అని చెప్పి మొదట్లోనే నిర్ణయం జరిగింది.

ఇలా ఏడవ్వలసిందే!

మొదట్లో డిస్పేచ్ సెక్షన్లో ఏడిశాను. ఇప్పుడు అక్కౌంట్సు సెక్షన్లో ఏడుస్తున్నాను. రేపు ఎక్కడ ఏడుస్తానో!

రేపణ్ణించీ జాగ్రత్తగా ఉండాలి.

అవధాని చెప్పినట్టు, జాగ్రత్తగా మసులుకోవాలి.

అయినా ఒకటి నా కర్థం కావడంలేదు.

నే నేతప్పూ చెయ్యలేదు. నా మనసు నిష్కల్మషంగా ఉంది. కాగా, నే నెందుకు భయపడాలి?

కాని నువ్వు నేరం చేశావని అంతా అంటారు.

వాళ్ళు చెప్పేమాటకే విలువ ఉంటుంది.

నీమాటా నామాటా ఎవడు నమ్ముతాడు?

అదీగాక రెండు ముఖ్యవిషయాలు నీవెరిగినవే!

ఏమిటవి?

గవరయ్య బిల్సు నీదగ్గరున్నాయి.

గవరయ్యవి అయిదువందల రూపాయలు నీదగ్గరున్నాయి.

సుబ్బయ్య కళ్ళు మూసుకున్నాడు.

లంచం! నేరం! శిక్ష! జెయిల్!

సుబ్బయ్య కళ్ళు తెరిచేడు.

దేవా! నాకు భయంగా ఉంది!

దేవా! నాకీ ఆలోచన్లు వద్దు!

నాకు మతిపోతోంది దేవదేవా!

లేడిపిల్లలు లేటుగా ఇంటికి వెళ్తున్నాయి.

పరమేశ్వరా! నా కెందుకీభయం?

సొట్టకాలువాడు ఆలస్యంగా బజారుకి వస్తున్నాడు.

సర్వేశ్వరా! నే నేవిధమైన నేరమూ చెయ్యలేదే!

వయ్యారిభామ కొబ్బరికాయలతట్ట ఖాళీ చేసుకొని పోతోంది.

భగవాన్! ఏపాపమూ ఎరగన్నేను.

సిల్కు జాకెట్టుపిల్ల లైట్‌హావుస్‌నుంచి వచ్చేసిందే!

ఈశ్వరా! సర్వేశ్వరా!

అందర్లోకీ పాపాలభైరవుడు హెడ్‌క్లార్కు... ఎర్రచీరమనిషి...అవధాని పాపం......వెంకట్రావు

కోసం చేసేను...జమీన్దార్లు...పాడు రోజులు...ఎద టింట్లోంచి దిగుతున్న దెవరు??

నల్లచీరావిడ కాదుకద!!

కాదు! కాదు! అయ్యయ్యో! కాదు!

నేనింత బాధల్లో ఉన్నానని ఆవిడ కేం తెలుస్తుంది?

తెలిస్తే, పాపం! ఆవిడకూడా బాధపడుతుంది.

నాకు తెలుసు!

నన్ను చూస్తే ఆవిడకి జాలి.

పోయి ఆవిడ వెచ్చటివళ్ళో పడుకుంటాను.

ఎంతో హాయిగా ఉంటుంది.

అరుగుమీద కూర్చున్న సుబ్బయ్య రాత్రి ఎనిమిదిన్నర గంటలవరకూ ఆలోచిస్తూ ఆరీతిగానే కూర్చున్నాడు. అవధాని ఆఫీసులో ఇచ్చిన హెచ్చరికతో అతనికి ఆందోళన, భయం కలిగి ఆ విషయంగురించితప్ప ఇంకే ఆలోచనా లేకుండా పోయింది. అందుచేతనే, లేచి ఇంట్లోకవెళ్ళి భోజనం చెయ్యడానికి కూర్చొనేవరకూ కమలసంగతి జ్ఞాపకం రాలేదతనికి.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది.

ఇంకా కమల రాలేదే! కమల ఇంతవరకూ రాలేదేం?

పోతన్నతో షికారు వెళ్ళిన కమల ఇంకా ఎందుచేత రాలేదు? పిల్ల ఏమయిపోయింది? ఏమయిపోయిందో ఏమిటో! వాడేం చేశాడో యేమిటో?

అన్నం వడ్డించుకోబోతూ వీధిలోకి వచ్చేశాడు సుబ్బయ్య.

కనుచూపుమేరలో ఎక్కడా కనిపించలేదు కమల.

సుబ్బయ్య ఇటూ అటూ తిరిగేడు. "మా అమ్మాయి కనిపించిందా" అని తెలిసినవాళ్ళని అడిగేడు. తెలియనివాళ్ళని అడగబోయి అడగడం మానేశాడు.

తొమ్మిదిగంటలయినా కమల రాలేదు.

వాడేంచేశాడో ఏమిటో! ఒంటిని బంగారం కూడా ఉంది! రెండుతులాలేఅయినా చేదా విషమా?

రెండుతులాలంటే ఈ రోజుల్లో రెండువందల రూపాయలు. ఇంట్లో ఉన్నది దాని ఒంటిని ఎరక్కపెట్టేను. ఎరక్క వాడితో పంపించేను. బంగారం కోసం ఎంతమంది ఎన్ని ఘోర కృత్యాలు...

సుబ్బయ్య గడగడ వణికేడు.

నేరకపోయి పంపించేను.

ఎంత అమాయకంగా వెళ్ళింది వాడితో!

ఏందారి భగవంతుడా!

పిల్లని వెతకడానికి ఇంకా ముందుకి వెళ్ళడమా? పోలీస్టేషన్‌కి వెనక్కి వెళ్ళడమా?

వెనక్కివచ్చి ఇంటిదగ్గర కూలబడ్డాడు. అరుగు మీద కూర్చొని ఆలోచించేడు.

పోతన్న వెంకట్రావుదగ్గర పనిచేసేడు కద! తెలిసినవాడు వెంకట్రావుకి...దొంగలా కనిపించలేదే మరి...కాని వెంకట్రావుదగ్గర ఇప్పుడు పనిచెయ్యడం లేదే...నమ్మకంలేకనే వెంకట్రావు మానిపించేశాడో ఏమిటో...పిల్ల ఒంటిమీద బంగారం ఉంది...కాణీ ఎత్తు బంగారంకోసం ఎంతమంది చిన్న పిల్లల్ని చంపెయ్యలేదు...చెమట చెమట...వెధవ చెమట... వెంటనే పోలీస్టేషన్కి వెళ్లాలి...రిపోర్టిస్తాను... సావిత్రి నన్ను చంపేస్తుంది ... వాడితో ఎందుకు పంపించేవు...బుద్ధీ జ్ఞానం లేదు...తక్కువ వ్యాధవల్తో పిల్లని పంపిస్తావా...కాని వాడు గవరయ్యదగ్గిర పని చేస్తున్నాడుకదా ... అయిదు వందలూ వాడే పట్టుకొచ్చేడు...నమ్మకం లేకపోతే సొమ్ము వాడిచేతికి ఇస్తాడా గవరయ్య...వాడు ఎగేస్తే ఏవడడగ్గలడు ...అయిదువందలకి ఆశపడన్ది ఈ వెధవ రెండు తులాలకీ ఆశపడతాడా...మొహం చూస్తే మంచివాళ్లాగే ఉన్నాడు...బీచిని కూర్చొనుంటారు ... రేడియో కూడా ఉంది......సినీమాకే పోయారో ... నేను డబ్బివ్వలేదే...కొంతసేపు చూద్దాం...

ఇట్టే భయపడతాడు సుబ్బయ్య.

అంతలోనే భయం పోయిందనుకుంటాడు.

కమలగురించి "సరే కొంతసేపు చూద్దాం" అనుకున్నాడు.

సరిగ్గా మరో ముప్పావు గంటికి ఇంటిముందు బండి ఆగింది.

సుబ్బయ్య గాభరాతో చూసేడు. చూస్తూండగానే సావిత్రీ, క్రిష్ణుడూ బండీలోంచి దిగేరు.

"ఏదీ కమలేదీ" అని ఆత్రతతో అడిగేడు వాళ్ళని.

"ఏమీ? ఇంట్లో లేదూ?" అని అడిగింది సావిత్రి.

"నాన్నా! సినీమా ఎంతో బావుంది" అన్నాడు క్రిష్ణుడు.

"అమ్మాయి కనిపించలేదా ఎక్కడా?"

నేరం చేసినవాళ్లాగ అడిగేడు సుబ్బయ్య సావిత్రిని.

"ఇంట్లో ఎందుకు లేదు?" అని ఎదురు ప్రశ్న వేసింది సావిత్రి మెట్లెక్కుతూ. ఆవిడ గాభరా పడుతోందో లేదో చెప్పడం కష్టం.

"ఇంట్లో లేదు. ఇందాట్లా పోతన్నతో వెళ్ళి ఇంకా రాలేదు"

క్రిష్టుడు ఇంట్లోకి రివ్వున పోయేడు. సావిత్రి మెట్లమీదే ఆగింది.

"పోతన్నెవడు?"

"గవరయ్య నౌఖరు"

"గవరయ్యెవడు?"

సావిత్రికి కనపడకుండా సుబ్బయ్య చిరాకు పడ్డాడు.

"అతనో కంట్రాక్టరు"

"వాడి నౌఖర్తో మనపిల్ల ఎందుకు వెళ్ళింది?"

"నేను పంపించేను"

"ఎందుకు పంపించేరు?"

"బుద్ధిలేక"

అని చెప్దామా అనుకొంటున్నాడు సుబ్బయ్య.

ఇంతలో ఇంటి ముందు సైకిల్ రిక్షా ఆగడం, అందులోంచి కమల గెంతడం, పోతన్న దిగడం జరిగేయి.

"అమ్మయ్యా! ఇదిగో పిల్ల!!" అన్నాడు సుబ్బయ్య.

"అమ్మా! నేనూ సినీమాకి వెళ్ళేనే" అంది కమల పట్టరాని సంతోషంతో.

"ఎందుకు వెళ్ళేవే????"

అతికోపంతో అడిగింది సావిత్రి.

కమల ఉత్సాహమంతా ఒక్కసారిగా చల్లారింది.

జవాబు లేకుండా నిల్చుండిపోయింది.

పెట్టెబండీ వెళ్ళింది.

సైకిల్ రిక్షా వెళ్ళింది.

"చిన్న పిల్లని ఇంటిదగ్గిర విడిచిపెట్టి మీరు సినీమాకెందుకు వెళ్ళేరో ముందు చెప్పండి"

అని అడిగిన మొగవాడు కమల చెయ్యిపట్టుకు నిల్చున్నవాడు, అతడు పోతన్న.

సుబ్బయ్య నిర్ఘాంతపోయేడు.

సావిత్రి అంతకంటె నిర్ఘాంతపోయింది.

విస్తుపోయి, ఆశ్చర్యపడిపోయి, నిర్ఘాంతపోయింది.

ఒక్కక్షణంపోయాక "నువ్వెవడివి?" అని అడిగింది కోపతీవ్రతతో.

"నేను పోతన్ననండి" అన్నాడు పోతన్న.

"పిల్లని నువ్వేనా తీసుకు వెళ్లేవ్?"

"చిత్తం"

"ఎవర్నడిగి తీసుకెళ్ళేవ్?"

"బాబుగారు తీసుకువెళ్ళమన్నారండి"

"ఎవరాబాబు?"

"అదిగో ఆ బాబేనండి?"

తనేదైనా చెప్పవలసిన అవసరం కన్పించింది సుబ్బయ్యకి. గొంతుక సవిరించుకున్నాడు. కాని నోటంట మాట రాలేదు. ఏమాట అనాలో తోచక.

సావిత్రికూడా ఆలోచిస్తోంది 'ఈ వెధవకి ఎలా బుద్ధి చెప్పడమా' అని.

ఈలోపున పోతన్న అందుకున్నాడు.

"అమ్మా! మీరు పెద్దవారు. నేను మీకు చెప్ప తగ్గవాణ్ణికాను. కాని మీరు సినీమాలకి వెళ్ళి, చిన్న పిల్లని అలా వదిలెయ్యడం ఏమీ బాగులేదు. మీకున్న సరదా చిన్నపిల్ల కుండదా? ఇహమీద ఎప్పుడూ ఇలా చెయ్యకండి. ఏం?"

సావిత్రికక్కూడా నోటంట మాట రాలేదు. అలాగే నిల్చుండిపోయింది మెట్లమీద.

తనభార్యకి పరాయివాడు బుద్ధి చెప్పడమేమిటి అని కోపగించుకోలేదు సుబ్బయ్య.

సావిత్రిలాంటి మనిషికి ఈ మనిషి ఎంత ధైర్యంగా బుద్ధిచెప్తున్నాడో అని ఆశ్చర్యపడ్డాడు.

ఆశ్చర్యపడ్డమేకాకుండా సంతోషించేడు.

ఆశ్చర్యం!!

సావిత్రి మాట్లాడలేకపోతోందే!!

"చిన్నమ్మా ఇంట్లోకి వెళ్ళు తల్లీ" అని కమలతో చెప్పి

"మరింక నేనొస్తానుబాబూ" అని వెళిపోయేడు పోతన్న.

సుబ్బయ్య సావిత్రివైపు చూసేడు.

సావిత్రి సుబ్బయ్యవైపు చూడలేదు.

"మొగుడు మొగాడు కాకపోతే ఆడదాని బతుకింతే" అన్నది ఇంట్లోకి వెళ్తూ, ఎవరితోనో అన్నట్టుగా.

సుబ్బయ్య ఇంట్లోకి వెళ్లడానికి భయపడ్డాడు.

6

తరువాతదినం సుబ్బయ్య ఆఫీసుకి కొంత ఆలస్యంగా వెళ్ళేడు. అప్పుడప్పుడు తప్పని సరిగా ఏదో పనివున్నప్పుడు ఆలస్యం అవుతూవుంటుంది. అందుగురించి ఆఫీసర్నెవరూ అంతగా తప్పుపట్టరు. రోజూ ఆలస్యంగా వెళ్తే మాత్రం సంజాయిషీ అడుగుతారు.

మామూలుగా తన సీట్లోకి వెళ్తున్నాడు సుబ్బయ్య.

హెడ్‌గుమాస్తా తనవైపు కొరకొర లాడుతూ చూడ్డం లేదు. తలవంచుకొని పోతున్నాడు.

సీట్లోకి వెళ్ళబోతూన్న మనిషిని రామస్వామి ఆపేడు.

"యూ కమ్ హియర్" అన్నాడు.

అతని కంఠం మృదువుగా లేదు.

సుబ్బయ్య, గదిమధ్యనున్న రామస్వామి 'సీటు' దగ్గరికి వెళ్ళేడు.

"ఎందుకు లేటుగా వచ్చేవ్?" అని సున్నితంగా కాకుండా అడిగేడు రామస్వామి.

"ఆలస్యం అయినందుకు క్షమించాలి సార్" అన్నాడు సుబ్బయ్య రుమాల్తో ముఖం తుడుచుకొంటూ.

ఆఫీసులో అంతా వారిద్దరివైపూ చూస్తున్నారు.

"ఆమాట వస్తూనే ఎందు కేడవకూడదు? పెద్ద ఆఫీసర్లాగ సీట్లోకి పోతున్నావే!"

ఎన్నడూ అనవసరంగా మాటపడని సుబ్బయ్య కొంతసేపు మాట్లాడలేక పోయేడు.

"క్షమించండి సార్, ఏదో మామూలుగా..."

"మామూలుగా, మామూలుగా, మామూలుగా! ఇదేపనయిపోతోంది నీకు. లేటుగా రాకూడదని ఎన్నిసార్లు నీతో చెప్పడం? ఏం? జీతం ఒట్టినే ఇస్తున్నా రనుకుంటున్నావా?"

రోజూ సరిగా వేళకే ఆఫీసుకి వస్తాడు సుబ్బయ్య. ఆదినం తెల్లవారి లేస్తూనే కమల కాలుకి దెబ్బతగుల్చుకొంది. ఆమెని ఆసుపత్రికి తీసుకువెళ్ళి రావడంలో కొంత ఆలస్యం అయింది.

"ఇవాళ ఏదో కొంచెం...కొంచెం ఆలస్యం అయిందండీ. రోజూ సరిగ్గా టైమ్‌కే వస్తున్నాను కదండీ...ఇవాళ మా అమ్మాయి..."

"మీ అమ్మాయి గిమ్మాయి! డోన్టాక్ రోట్! ప్రతిరోజూ లేటుగా ఒస్తావ్! అడిగితే ఇన్సొలెన్ట్‌గా జవాబులు చెప్తావ్! ఏమిటనుకుంటున్నావు నీ మనసులోకి నువ్వు? గజెటెడ్ ఆఫీసర్వా? ఐ. సి. యస్. ఆఫీసర్వా? ఆఫీసులో దమ్మిడీయెత్తు పని చెయ్యలేవు! ప్యూన్ వెంకన్నా ఈజ్ ఫార్ బెటర్ దేన్ యూ! కంట్రాక్టర్స్ దగ్గరకి పోయి చెయ్యి చాచడానికి మాత్రం తయారు! టేక్కేర్! డిస్మిస్ అయిపోతావు!"

సుబ్బయ్య కేమీ అర్థం కావటంలేదు. అతనికి కంపం పుట్టుకొచ్చింది. హెడ్ గుమాస్తా తాలూకు మేజా పట్టుకొని నిల్చున్నాడు.

"డోన్ట్ లీన్ ఆన్ మై టేబెల్! గో టు యువర్ సీట్" అని అరిచేడు రామస్వామి.

అదే తడవుగా తన కుర్చీవైపుకి పోబోయేడు సుబ్బయ్య.

ఆ కుర్చీలో రామారావనే మరొకతను కూర్చున్నాడు.

గదిమధ్య గడబిడ పడుతూ నిల్చున్నాడు సుబ్బయ్య.

ఇంకా వణుకుతూనే ఉన్నాడు.

అంతా అతనివైపే చూస్తున్నారు, సూదుల్లాంటి చూపులతో.

"తమరి సీటు ఇవాళనుంచీ పాత సీటేనండి" అని వెటకారంగా నవ్వి మూలనున్న ఖాళీ కుర్చీ చూపించేడు రామస్వామి.

DESPATCH!!!

తిరిగి తపాలా బంట్రోతు నౌఖరీ!!

కుర్చీలో ఎలా వెళ్లి కూర్చున్నాడో సుబ్బయ్యకి తెలియదు. భారంగా వేడిగాఉంది అతని తల. కూర్చున్నాడే కాని అతని కాళ్ళూ చేతులూ వణుకుతూనే ఉన్నాయి. తల వంచుకొని కూర్చున్నాడు. చుట్టూ తోడివాళ్ళవైపు చూడ్డానికి భయంగాఉంది. సిగ్గుగా ఉంది.

"జాగ్రత్తగా మసులుకో" అని అవధాని అనడం, "ఏం సుబ్బయ్యా! గవరయ్య బిల్సన్నీ పూర్తిచేసేవా?...నువ్వెక్కడ చేస్తావ్" అని ముందు రోజు రామస్వామి అడిగి రిమార్క్ చేయడం; వీటి

తోచే మతిపోయిన సుబ్బయ్యకి కుర్చీలో, పాత కుర్చీలో, కూర్చున్నప్పుడు మతి పూర్తిగా పోతున్నట్టుగా ఉంది.

"వీడు లంచం పుచ్చుకొన్నాడు" అని ఆఫీసర్‌తో చెప్పేసి ఉంటాడు రామస్వామి.

ఇహ నన్ను డిస్మిస్ చేస్తారు కాబోలు!

పరమేశ్వరా! నన్ను కాపాడు! కాపాడు!

అని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కూర్చున్నాడు సుబ్బయ్య.

పన్నెండు గంటలయింది.

పన్నెండు గంటలు దాటింది.

"నమస్కారాలండోయ్!'' అంటూనే గదిలోకి వచ్చేడు గవరయ్య.

"రండి, రండి'' అన్నవాడు రామస్వామి.

తొందరగా కుర్చీ తెచ్చి వేసినవాడు వెంకన్న.

ఆ కుర్చీలో కూర్చున్నవాడు గవరయ్య.

"పుట్టగానే ఎందుకు చచ్చేను కాను?" అనుకొంటున్నవాడు సుబ్బయ్య.

గవరయ్య రాగానే కలిగిన భయంవల్ల బాధవల్ల, విచారంవల్ల, 'టెరర్' వల్ల సుబ్బయ్య కళ్ళంట నీళ్లు గిర్రున తిరిగేయి. ఏదీ వినకుండా ఎటూ చూడకుండా ఉష్ట్రపక్షిలా కూర్చున్నాడు.

మరొక పదినిమిషాలకి తలెత్తిచూసేడు.

అవధాని తనవైపు సూటిగా పక్కగా చూస్తూ "మరేం భయంలేదు" అన్నట్టు సంజ్ఞచేసేడు.

ఆపదలో ఉన్నవాళ్ళకి అవధాన్ని చూడగానే ధైర్యం కలుగుతుంది.

ఇంతలో గవరయ్య లేచేడు. వెనక్కి తిరిగేడు.

"నమస్కారాలండోయ్, సుబ్బయ్యగారూ" అని అన్నాక రామారావుని చూసేడు.

"ఓహో! రామారావుగారొచ్చేరే!"

"రండి! కూర్చోండి" అనలేదు రామారావు.

"అవునండీ, గవరయ్యగారూ! సుబ్బయ్యున్నాడే, చూసేరు కదూ, చాలా ఇనెఫిషెంట్‌గా ఉన్నాడు. అంచేత సీట్ ఛేంజ్ చేసేను" అన్నాడు రామస్వామి, పొడుం పీలుస్తూ.

''ఓహో! అలాగా, బాగానేఉంది...అయితే మరి సెలవ్! నే వెళ్లొస్తా"

గవరయ్య వెళ్ళేడు.

"ఏం సుబ్బయ్యా! ఏమిటి చూస్తున్నావు?'' రామస్వామి అడిగేడు.

"నే... నే... నేనా?"

"అవును."

''ఏ ఏమీ లేదండీ"

"ఏమీ లేదండీ" అని వెక్కిరించేడు రామస్వామి.

ఆఫీసులో కొంతమంది నవ్వినట్లయింది.

"ముందు లెటర్సన్నీ డిస్పేచ్చెయ్! తరవాత యూ కెన్ టేక్ రెస్ట్!'' అని రామస్వామి కసిరేడు.

పనిచెయ్యమంటున్నాడని గ్రహించేడు సుబ్బయ్య.

ఆరోజుకి ఎలాగైతేనేం పని తెముల్చుకున్నాడు. సాయంకాలం, ఎలా అయితేనేం, ఆఫీసులోంచి బైటపడ్డాడు.

చల్లగాలి వీచ్చేడు.

మెల్లిగా కాళ్ళీడ్చుకొంటూ నడుస్తూఉంటే అవధానివచ్చి భుజంమీద చెయ్యివేసేడు.

"మరేం ఫర్వాలేదోయ్! సుబ్బన్నా! సీటు మారింది. అంతేనా? అంతకన్న వాడు నిన్నేం చెయ్యగల్డు?"

"నే చేసిన్నేరమేఁవీఁ లేదోయ్...మా వెంకట్రావు నెరుగుదువుకదా?" అని గద్గద స్వరంతో అన్నాడు సుబ్బయ్య.

"ఓఁ! ఎరక్కేఁవీఁ"

జరిగినదంతా చెప్పేడు సుబ్బయ్య.

"అయితే, అందులో నువ్వు కాణీఎరగవందూ! అంతా ఒట్టినే తెచ్చిపెట్టుకున్నావ్"

"అవునోయ్! ఇప్పుడంతా పీకలమీదకి వచ్చింది"

"నీమీదకి వచ్చేదేమిటుంది? ఏగుడ్డూ రాదు!"

"అది కాదోయ్!......డి......డిస్మిస్‌లూ, కేసూ..."

అవధాని నవ్వేడు.

"నీకేం పిచ్చేమిటోయ్. సుబ్బన్నా. ఎవ్వడైనాసరే నీతలమీద వెంట్రుక తెంపలేడనుకో!"

"అయితే నాకేం ఫర్వాలేదంటావా?"

"ఏమీ ఫర్వాలేదయ్యా! రామస్వామిగాడేదో అన్నాడని భయపడుతున్నావేమిటి? అసందర్భం! నువ్వుకూడా వాళ్లాగే కక్కుర్తిపడుతున్నా

వని వెంటనే సీటు మార్చీసేడు. అంతకన్న ఆ వెధవ గాని మరేవెధవగాని చేసే దేమీలేదు!"

అని సుబ్బయ్యకి ధైర్యం చెప్పి బట్టతలమీద పెట్టుకున్న టోపీ తీసి, ఒక్కసారి గుండు నిమురుకొని, మెల్లకన్నుతో అతనివైపు చూసేడు అవధాని.

సుబ్బయ్యకి కొద్దిగా ధైర్యం కలిగింది.

"నీలోఉన్న లోటుపా టేమిటంటే, ఓయ్ సుబ్బన్నా, నీకు నోటంట మాట సరిగా రాదోయ్. ఆ వెధవ అలా అరుస్తూఉంటే బెల్లం కొట్టినరాయిలా ఊరుకుంటావేం? నీ అనువుచూసి వాడెగిరేడు. వాడు షేడీ అన్నప్పుడు నువ్వు షేడీ అంటే, వెధవ, చచ్చినట్టు ఊరుకోణ్ణు. నేనయితే ఆ వెధవ పొడుంముక్కు పట్టుకొని సాగదీసేద్దును"

అవధాని అందర్నీ అలాగే అనెయ్‌గలడు.

ఆరీతిగా సుబ్బయ్యకి ధైర్యం చెప్పిన అవధాని దార్లో విడిపోయేడు. సుబ్బయ్య మెల్లగా ఇల్లు చేరుకున్నాడు.

ఇంటిమెట్లెక్కి నడవదాటి లోపలకి వెళ్ళి సుబ్బయ్యచూసిన దృశ్యం ఇది.

లోపల వరాండాలో సావిత్రి కుర్చీ వేసుక్కూర్చుంది. ఆవిడవెనక కుర్చీ పట్టుకొని చెరో పక్కా కమలా క్రిష్ణుడూ నిల్చున్నారు. ఎదురుగా స్తంభానికి చేర్లబడి నేలమీద పోతన్న కూర్చున్నాడు.

పోతన్న ఏదో చెప్తున్నాడు. మిగతా ముగ్గురూ నవ్వుతున్నారు.

ముందురోజున జరిగిన ఘర్షణతో పోతన్నమీద మండిపడ్డానికి బదులు అతను చెప్పేది ఎదురుగా కూర్చొని సావిత్రి నవ్వుతూ వింటున్నందుకు సుబ్బయ్య కొంచెం ఆశ్చర్యపడ్డాడు.

సుబ్బయ్యని చూసి పోతన్న లేచి దండం పెట్టేడు.

ఆఫీసులో తిట్లు తిని ఇంటికివచ్చి దండం పెట్టించుకోడం కష్టమనిపించింది సుబ్బయ్యకి.

"కూర్చోవోయ్" అన్నాడు హీనస్వరంతో.

పోతన్న కూర్చున్నాడు.

"నాన్నా, నాన్నా; పోతన్నకి మంచిమంచి కథలు తెలుసున్నాన్నా" అన్నాది కమల ఎంతో సంతోషంతో.

"పోతన్న మన మావయ్యదగ్గిర పనిచేసేట్ట నాన్నా" అందువల్ల పోతన్నకూడా కొంత ఘనత అబ్బినట్టు చెప్పేడు క్రిష్ణుడు.

అదీ కారణం! అనుకున్నాడు సుబ్బయ్య.

తన అన్న తాలూకుమనిషి కాబట్టి ఆమనిషిలో ఎన్ని తప్పులున్నా క్షమిస్తుంది సావిత్రి.

పోతన్న చెప్పే కబుర్లు అంత కులాసాగా కూర్చొని వినడాని క్కారణం అది.

"సరేసరే" అనేశాడు కమలా క్రిష్ణులతో.

తిన్నగా గదిలోకిపోయి, దుస్తులు మార్చుకొని, కాళ్ళూ చేతులూ కడుక్కొని, తిరిగి వీధి వసారాలోకివచ్చి మామూలుస్థలంలో కూర్చున్నాడు. పోతన్నకూడా వసారాలోకి రావడం అతను గమనించలేదు.

పోతన్న మెల్లిగా సకిలించేడు.

"ఏం, పోతన్నా"

"మరేం లేదండి"

"ఏం? ఇలా ఒచ్చేవ్?"

"ఏంలేదండి. వెళ్ళమంటే వచ్చేను"

"వెళ్ళమంటే రావడ మేమిటోయ్?"

"గవరయ్య పంపించేడండి?"

ఎందుకో నాకు తెలుసు!

"గవరయ్య అడుగుతున్నాడండి"

అడిగేదేమిటో నాకు తెలుసు. అయినా—

"ఏమడుగుతున్నాడు?"

"అయిదువందలు ఎప్పుడిస్తామన్నారో అడగమన్నాడండి"

అవును! అదే! అవునవును! అదే! అదే!

గవరయ్య ఎలానూ అడుగుతాడు. అడగడామరి!

ఇప్పుడెలాగా అడుగుతాడు కచ్చితంగా!

ఎందు కడగడు?

ఇప్పుడు రామారావు చేతుల్లో ఉన్నాయి గవరయ్య బిల్సు.

సుబ్బయ్యేం చేస్తున్నాడు? ఏం చెయ్యగలడు.

తపాలా బంట్రోతు పని చెయ్యగలడు. చేస్తున్నాడు

అడక్కుండా ఊరుకొంటాడా గవరయ్య! అందులోనూ గవరయ్య!

సుబ్బయ్య పరపతిపోనే పోయింది.

నా పరపతివల్ల ఏదో ఘనకార్యం జరిగిందని పొంగిపోయేను.

నా పరపతి కాదది. అక్కౌంట్సు సీటు పరపతి.

ఈరోజు ఆసీట్లో ఆ పరపతిమీద రామారావు కూర్చున్నాడు.

ఈరోజునుంచీ సుబ్బయ్య మామూలు సుబ్బయ్యే!

సుబ్బయ్యని ఈరోజు ఏది పనిచేతే అదే అడుగుతాడు, ఏమాట నోటికివస్తే అమాటే అంటాడు, ప్రతీవాడూ.

అడుగుతున్నాట్ట, గవరయ్య!!

"అయిదువందలూ ఎప్పుడిస్తామన్నారో అడగమన్నాడండి"

ఎప్పుడు? అయిదువందలూ ఎప్పుడిస్తాను?

"అతగాడికి అవసరంగా ఉందిటండి. అర్జెంటుగా జతపర్చమన్నాడు."

అయిదువందలూ అర్జంటుగా జతపర్చాలిట! ఎక్కణ్ణించి తెచ్చేది? ఎలా జతపర్చేది?

జతపర్చలేనే! వెంకట్రావే ఇచ్చుకోవాలి... సొమ్ములేకే నాదగ్గిర కొచ్చేడు...ఇంత వేగిరం ఎలా ఇవ్వగలడు...

"గవరయ్యతో ఏం చెప్పమన్నారండి?"

"కొంత వ్యవధియిస్తే ఇచ్చేస్తాను"

వచ్చేసింది మాట!

ఇవ్వననేస్తే ఎంత బావుణ్ణు!

ఇవ్వననేస్తే ఏం చెయ్యగలడు గవరయ్య?

ఏంచెయ్యగలడా? ఏమైనా చెయ్యగలడు. గవరయ్యకోపంవస్తే ఏమైనా చెయ్యగలడు. అటువంటి మనిషితో పేచీలు పెట్టుకొని ప్రయోజనం లేదు. సాఫీగాపోతే నయం.

"సరేలెండి. అతగాడితో అలా చెప్తా"

మళ్ళ కంట చూస్తాననే ఇచ్చేడా సొమ్ము! లేదే! అటువంటప్పుడు ఇస్తానన్నందుకే సంతోషిస్తాడు. ఇచ్చేస్తాను. ఎప్పుడో ఒకప్పుడు ఇచ్చేస్తాను. రాదని విడిచిపెట్టుకున్న సొమ్ము ఎప్పుడువస్తేనేం అనుకుంటాడు. చదువంటే ఆట్టే లేదుగాని మర్యాదా తెలిసినమనిషే

ఈలోపున వెంకట్రావు ఎడంచేత్తో పారేస్తాడు.

పోతన్న గభీమని అన్నాడు.

"గవరయ్య దొంగముండాకొడుకండి"

పోతన్నిలా అంటున్నాడేం??

"వాడిదగ్గిరెవ్వడూ డబ్బు పుచ్చుకోకండి"

ఒకసారయింది చాలు. కాని, పోతన్న ఇలా అన్నాడేం?

"వాడు పేచీకోరుమనిషండి"

పోతన్న ఇలా చెప్తున్నాడెందుచేత?

సుబ్బయ్యకి బెంగగా ఉంది.

రాత్రి చీకటిగా ఉంది.

పోతన్న వెళ్ళేడు. అరే! ఎప్పుడు వెళ్ళిపోయేడు? తల నొప్పిగా ఉంది ... జ్వరం కానివచ్చిందా ... హాయిగా ఎక్కడకైనాపోయి విశ్రాంతి తీసుకుంటే బావుణ్ణు......హాయిగా ఎక్కడకైనాపోయి పడుక్కుంటే బావుంటుంది...కష్టసుఖాలకి దూరంగా పోతే హాయిగా ఉంటుంది...ఎవరైనా వచ్చి చల్లటిచెయ్యి నుదుటిమీద వేస్తే....ఎవరికొక్కావాలి నా వెధవ బాధలు...కళ్ళు మూసుకున్నా ఓలాగే ఉంది...కళ్లు తెరుచుకున్నా ఓలాగేఉంది...నల్లగా నల్లనల్లగా... భయమేస్తోంది...నల్లచీరావిడ...ఏదీ...వస్తేబావుణ్ణు ...టైమెంత...గడియారం ఆగిపోయిందా...పాపం ...నే ఒస్తానుండండి...'కీ' యివ్వనా...ఇప్పుడు ...ఎలా ఉంది...హాయిగాఉందా ... నుదుటిమీద చెయ్యి వెయ్యనా ... ఇలా పడుక్కోండి నావళ్ళో అయ్యో అలా ఉన్నారేం......ఎంత నీరసంగా ఉన్నారో...ఆకలి వేస్తోందా...

ఉలిక్కిపడి కళ్ళు తెరిచేడు సుబ్బయ్య.

ఆకలిగా ఉంది. బాగా ఆకలిగా ఉంది.

ఈరోజు ఇంత ఆకలి వేస్తోందే—ఎందుచేత? లేచినపుడు ఒళ్ళు జోగిం దతనికి. భోజనం చేస్తున్నప్పుడే నిద్రవచ్చింది. అలసటతో వళ్ళెరక్కుండా నిద్రపోయేడారాత్రి.

జరిగినదంతా కలా నిజమా అనుకున్నాడు మర్నాడు నిద్రలేచి. పక్కమీద కూర్చొని ఒక్కటొక్కటీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు. ఒక్కొక్క విషయం సర్తుకు రావడంతో తిరిగి కంపం పుట్టుకొచ్చింది. ఆరోజు ఆఫీసుకి వెళ్ళడానికే భయపడ్డాడు.

కాని, ఆలస్యం అవుతుందేమోనని తొమ్మిదిన్నరకే బయల్దేరేడు. ఆఫీసు చేరేసరికి ఇంకా గేటు తలుపులే తెరవలేదు. సిగరెట్టు కాలుస్తూ గేటుదగ్గర నిల్చొని దిక్కులు చూస్తున్నాడు.

రిక్షాలో ఎవరో వెళ్తున్నారు.

ఎక్కడో చూసినట్టుగా గుర్తు. జోరుగా పోతోందా రిక్షా.

ఎవరు చెప్మా? ఎవరావిడ?

నామతిమండినట్టుగానే ఉంది. ఆవిడే! అయ్యయ్యో ఆవిడే!

నల్లచీరావిడే!!

ఇవాళ తెల్లచీర కట్టుకొంది.

చెయ్యి ఊపుతోంది!!

ఎవర్ని చూసి??!!

చుట్టుపక్కల ఎవరూ లేరే!

వెధవ తెలివి! వెధవ తెలివి!

నన్ను చూసే సంజ్ఞ చేస్తోంది!!

హాయ్‌హాయ్! నన్ను చూసే హాసం చేస్తోంది!

పలకరిస్తోంది!!

అయ్యయ్యో వెళిపోతోంది.

నన్ను చూసి నవ్వుతూ, ఎంతో ముద్దుగా నవ్వుతూ నన్ను నన్నే పలకరించింది!!

ఆనందంతో నీరసంగా నిల్చున్నాడు, గేటుకి చేర్లాబడి. అతనికళ్ళంట ఆనందబాష్పాలు రాలేయి. త్రుటికాలం స్వర్గంలో ఉన్నాడు.

ఇంతలో ఆఫీసు తలుపులు తెరిచేరు.

తిరిగి భూమ్మీద గుభేల్ మని పడ్డాడు.

"నరకానికి గేటు తెరిచేరు" అనుకున్నాడు మనసులో.

తలవంచుకొని ఆఫీసులోకి వెళ్ళేడు.

తలవంచుకొని ఆఫీసులోంచి వచ్చేడు.

అలా వెళ్తూ వస్తున్నాడు.

గవరయ్యకూడా ఆఫీసుకి వస్తూ వెళ్తున్నాడు. కాని సుబ్బయ్యతో మాట్లాడ్డంలేదు, ఆఫీసులో అందర్నీ పలకరించినట్టుగా తప్ప. ఏభోగట్టా అతను ఎత్తకపోడం చూసి ఇహ ఫరవాలేదనుకున్నాడు సుబ్బయ్య. ఏదో మాటవరసకి అడిగేడేమో! లేక అంత తొందరగా లేదో! తొందరగా ఉంటే మళ్ళీ అడగడా? ఈలోపున వెంకట్రావుని మెల్లిగా అడగొచ్చు. వెంకట్రావు చిరాకుపడతాడు. కొంచెం చిరాకు జాస్తీ అతనికి. సరే, మెల్లిగా ఏదో ఒహాటి చెయ్యొచ్చును. వెధవది! ఇదే జ్ఞాపకమా గవరయ్యకి! లక్షాధికారి. లక్షపన్లుంటాయి. లక్షలమీద వ్యాపారం చేస్తున్నాడు. అయిదువందలంటే ఏపాటి! మర్చిపోయుంటాడేమో. లేకపోయినా అంత తొందర లేదు.

ఈరీతిగా ఈవిషయంగురించే సుబ్బయ్య ఆలోచిస్తూ ఒకరోజు ఉదయం బజారుకి వెళ్తున్నాడు.

వెళ్తూవుంటే ఎర్రటికారు అతనిపక్క ఆగింది.

పక్కకి తప్పుకో బోయేడు.

కార్లోంచి ఎవరో అతని జెబ్బపట్టుకున్నారు.

కారు కిటికీదగ్గర నల్లటి మీసాలు, బంగారపు 'ఫ్రేం' కళ్ళద్దాలు.

గవరయ్య!!

'ఏ...ఏమండోయ్...గ...గవరయ్యగారూ'

"పలకరింపులు, మర్యాదలూ అటుంచి అసల్సంగతి చెప్పవోయ్! డబ్బివ్వ దల్చుకోలేదేంటి?"

గడ గడ గడ గడ.

ఉన్న పనులమాట మర్చిపోయి చాలామంది చోద్యం చూస్తున్నారు.

"అబ్బే! అబ్బే"

"అబ్బే గిబ్బే! ఆఖరికి బెబ్బెబ్బే అనేట్టున్నావు. నాదగ్గిర వేషాలు పనికిరావు తెలుసా! వీడు గవరయ్యని తెలుసుకో! మర్యాదాగా పట్టుకెళ్ళిన సొమ్ము మర్యాదాగా ఇచ్చెయ్! టోపీ వేద్దామనుకున్నావా, తొక్కలోల్చేస్తాను"

"చిత్తం! చిత్తం! సరే సరే!!"

"సొమ్మిచ్చేసి గౌరవం దక్కించుకో"

"చిత్తం చిత్తం! కొంకొద్దిగా టైం ఇప్పించండి"

"పదిరోజులే గడువు! ఈ లోపున ఇవ్వకపోయావా చూసుకో తమాషా"

గవరయ్య మీసాలు దువ్వుకొంటూ ఉండగా, సుబ్బయ్య చెమట తుడుచుకొంటూ ఉండగా ఎర్రగా ఉండే మోటారు కారు పరుగుతీసింది.

పదిహేనుమంది చుట్టూ మూగి అడుగుతున్నారు. అంటున్నారు.

"ఏమిటండీ అయింది?"; "ఏమిటడుగుతున్నాడండీ?";

"తన్నబోయేట్టు"; "ఎవడు?"; "గవరయ్యలా ఉన్నాడు"; "గవరయ్యే"; "లెంపకాయిచ్చుకున్నాడు"; "నోటంట రక్తం కారుతోంది";

"పే డూరుకున్నాడా?"; "ఏమండీ ఏమిటీ దెబ్బలాట?"

పదిహేనుమంది పాతికమందయేరు.

గాభరాలో, సిగ్గుతో, అవమానంతో బజార్లోకి పరుగెత్తేడు సుబ్బయ్య.

అశ్రద్ధ పనికిరాదు. అశ్రద్ధ పనికిరాదు.

వెంకట్రావే శరణ్యం. శరణ్యం.

వెళ్ళాలి. అతనిదగ్గరకి వేగిరం వెళ్ళాలి.

అదిగో! వెంకట్రావే!!

అదృష్టం! అదృష్టం!

భగవంతుడుడికి నమస్కారం చేసి వెంకట్రావుని పలకరించి జరిగిన సంగతి టూకీగా చెప్పేడు సుబ్బయ్య. వెంకట్రావు చిరాకుపడ్డాడు.

"నువ్వు చేతకాని చచ్చు పెద్దమ్మవోయ్ బావా''

అతనలా అన్నందుకు సుబ్బయ్య నొచ్చుకోలేదు.

"ఆ సొమ్మేలాగైనా నాయందు దయుంచి జతపర్చాలోయ్'' అన్నాడు దీనంగా.

ఎటో చూస్తూ ఆలోచించేడు వెంకట్రావు.

ఎవర్నయినా సరే మోసపుచ్చడానికి వెంకట్రావు సాధారణంగా వెనకతియ్యడు.

"జాలి'' అనే పదం చాలాకాలం క్రితం మర్చిపోయేడతను.

కాని ఆరోజు.

చిరిగిన కాలర్‌గల షర్టుతో, భుజాన్న కూరల సంచితో కళ్ళల్లో నీళ్ళతో నిల్చున్న చెల్లెలి పెనిమిటిని చూసి కొంత జాలిపడ్డాడు.

"సరే! వారం పదిరోజుల్లో చూస్తాన్లే. ఈలోపున ఎల్లుండోసారి కనిపించు''

వెంకట్రావు రెండు చేతులూ పట్టుకున్నాడు సుబ్బయ్య.

7

మెయిన్‌రోడ్డులోంచి సందులోకి మళ్ళగానే దక్షిణంవైపు కనిపించే రెండో ఇల్లే వెంకట్రావుది. "ఆ యిల్లే వెంట్రావుది" అంటే అర్థం అది అతని స్వంతం అని కాదు.

అతను అన్నివిధాలా అది తన ఇల్లులాగే వ్యవహరిస్తాడు.

అంటే, అందులో అద్దెకి ఉన్నాడతను.

మెయిన్‌రోడ్డులోంచి సందులోకి రాగానే కనిపిస్తుందా యిల్లు.

ఆ యింటి డాబాజాలునుండి వేళ్ళాడే 'బోర్డు' కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

ఆకుపచ్చబోర్డుమీద "వెంకట్రావ్, ఇంజనీర్ అండ్ కంట్రాక్టర్" అని ఇంగ్లీషులో వ్రాసిన తాటికాయలంతేసి నీలి అక్షరాలు ఇంకా స్పష్టంగా కనిపిస్తాయి. (ఇంజనీర్ అండ్ కంట్రాక్టర్ అంటే ఇంజనీరు కాడు, కాని చాలా పెద్ద కంట్రాక్టరు అని అర్థం) రాత్రి ఎనిమిది గంటలకి అటువైపు వస్తూన్న సుబ్బయ్య, ఆ యింటినిగాని, ఇంటికి వేళ్ళాడే ఆకుపచ్చరంగు బోర్డునిగాని, తాటికాయలంతేసి వున్న నీలి అక్షరాలనిగాని గమనించలేదు.

వస్తూనే అతను చూసినది వీధి అరుగుమీద కూర్చొన్న వెంకట్రావునే. అతడతణ్ణారాత్రెనిమిది గంటల సమయంలో చూసి "హమ్మయ్య"ని నిట్టూర్చేడు. ఎదురుగా అరుగుమీద కూర్చున్నవాణ్ణి చూసి ఏడుకొండలవాణ్ణి చూసినంతగా సంతోషించేడు. వెంకట్రావుని చూడగానే అనేకమందికి సంతోషం కలుగకపోవచ్చును. కాని సుబ్బయ్యకి మాత్రం ఆ రాత్రి సంతోషం కలిగింది.

ఆరోజు వెంకట్రావింటికి సుబ్బయ్య రావడం అది మూడోసారి.

"ఎల్లుండోసారి కన్పించు" అని వెంకట్రావు చెప్పిన ప్రకారం సుబ్బయ్య వెళ్తే అతను ఇంట్లో లేడు. ఆరీతిగా వరసగా రెండుమూడురోజులు వెళ్ళేడు. తరువాత రెండుదినాలు ఆగి తిరిగి అతనింటికి వెళ్ళినా వెంకట్రావు ఒక్కసారి కనిపించలేదు. ఎన్నిసార్లు వెళ్ళినా "వీధిలోకి వెళ్ళే"రన్న మాటే వినవచ్చింది.

ఆ రోజుకూడా మొదటిసారి వెళ్ళినప్పుడు "ఇంట్లో లేరు" అనే సమాధానంవచ్చింది పిలవగా, పిలగా. రెండవసారి వెళ్లినప్పుడు వెంకట్రావు ఊళ్ళోనే లేడన్నారు.

ఇంటికి ఎప్పుడు వెళ్లినా "ఇంట్లో లేరు", "ఎక్కడకో వెళ్ళేరు", "ఎప్పుడు వస్తారో తెలీదు" అనే మాటలే వినవస్తూండడంచేత, వెంకట్రావు ఇంట్లో ఉండే లేడనిపించుకొంటున్నాడేమోనని సుబ్బయ్యకి చిన్న అనుమానం కలిగి గట్టి నమ్మకంగా మారింది. ఒకరోజు "ఎక్కడికో వెళ్ళేరు" అనే మామూలు సమాధానం వచ్చినా "సరే, వచ్చేదాకా వెయిట్‌చేద్దాం" అని అక్కడే గుమ్మంలో కూర్చున్నాడు. వెంకట్రావు ఎంతకీరాడే! ఎంత పనిమీద ఎక్కడికి వెళ్ళినా ఇంత ఆలస్యం అవదుగదా అనుకున్నాడు సుబ్బయ్య.

తలుపుతట్టి దమాయించి వెంకట్రావింట్లోకి వెళ్ళడానికి సుబ్బయ్యకి ధైర్యంలేదు. ఎప్పుడైనా అత నాహ్వానిస్తే అతని గుమ్మంలో అడుగుపెట్టడమే గాని లేనప్పుడు బైటనిల్చోవలసిందే. లోపలికి వెంకట్రావు ఆహ్వానంమీద వెళ్ళినా అత నెక్కడ కూర్చోపెడితే ఆ గదిలో అలా కూర్చోడమే కాని ఇంట్లో చనువుగా తిరగడానికి వీల్లేదు.

"నా అనుమతి లేకుండా నా యింట్లో అడుగు పెట్టడానికి ఎంతమాత్రం వీలు లేదు."

అని వెంకట్రావు ఎన్నడూ సుబ్బయ్యతో చెప్పలేదు. కాని అతని అనుమతి లేందే అతని గుమ్మం దాటడానికి సుబ్బయ్య భయపడతాడు.

అందుచేతే వెంకట్రావు ఉన్నాడని తెలిసినా ఇంట్లోకి వెళ్ళలేకపోవడం, వీధి అరుగుమీద పడిగాపులు కాయటం జరుగుతూ వచ్చింది.

ఆ రోజు ప్రొద్దుట రెండవసారి వెళ్ళినప్పుడు కూడా ఇంట్లోంచి మామూలుమాటే వినవచ్చింది.

"ఎక్కడికో వెళ్ళేరండీ!" అని మృదువుగా శ్రావ్యంగా వచ్చింది మాట.

ఆవిణ్ణి ఎప్పుడూ చూడకపోయినా ఆమాట అంత మృదువుగా చెప్పిన వ్యక్తి వెంకట్రావు ఉంపుడుగత్తెనని సుబ్బయ్యకి తెలుసు.

"మీ బావమరిది చక్కటి మనిషిని జాగ్రత్త చేసేడయ్యా" అని అతన్తో అనేకులు అన్నారు. ఇంత బావుంటుంది, అంత బావుంటుంది అని అనుకోగా వినడమేగాని సుబ్బయ్యెప్పుడూ చూడ్డం తటస్థించలేదు. కాని, ఆవిడ చెప్పలేనంత అందంగా ఉంటుందని సుబ్బయ్య మనసులో బాగా నాటిపోయింది.

"ఇంతటి అపురూప సౌందర్యవతి, ఇంత మృదుమధుర కంఠంతో ఎంత సులభంగా అబద్ధం చెప్తోంది!"

అని సుబ్బయ్య ఆశ్చర్యపోయేడు.

విచారించేడు.

"ఆడవాళ్లు ఎంతకైనా సమర్థులు" అనుకున్నాడు ఒక్కక్షణం.

కాని ఆవిడ తనంతటతాను బుద్ధిపూర్వకంగా అబద్ధమాడిం దనుకోడం సుబ్బయ్య కిష్టంలేదు.

వెంకట్రావు చెప్పమన్నప్పుడు, పాపం, అలా చెప్పక తప్పుతుందా!

అందమైన ఆడమనిషి బుద్ధిపూర్వకంగా తప్పు చేసిం దనుకోడం సుబ్బయ్యకి ఎంతమాత్రమూ ఇష్టం లేదు.

ఉంచుకున్నాడు! పోషిస్తున్నాడు!

ఎలా చెయ్యమంటే అలా చెయ్యాలి.

పాపం! ఈవిణ్ణనవలసిన పనేమీ లేదు.

అని సమాధానపర్చుకున్నాడు.

ఇంట్లో లేడని వినగానే సుబ్బయ్య వెనక్కిపోవడం జరుగుతూ వచ్చింది. మరొక ప్రశ్న వెయ్యడం లేదతను. క్రాస్ పరీక్ష చేద్దామనే తలంపే లేదతనికి.

అవతలమనిషి చెప్పేది అబద్ధం అని తెలిసినప్పుడు ఇవతలమనిషికి కలిగే సుపీరియారిటీవల్లనో, లేక కోమలాంగి కోమలగాత్రం అయినా విందామనే ఆసక్తిచేతనో గాని సుబ్బయ్య ఆరోజు రెండవసారి వచ్చినప్పుడు వెంటనే వెళ్ళిపోకుండా,

"ఎక్కడికి వెళ్ళేరండీ?"

అని అడగ్గలిగేడు.

చెప్పిన భోగట్టా విని వెళ్ళడమేగాని ఎదురుప్రశ్న వేసే అలవాటులేని సుబ్బయ్య ఆరీతిగా అడిగినందువల్ల కలిగిన ఆశ్చర్యంచేతనో, మరెందుచేతనో గాని లోనుంచి సమాధానం ఆలస్యంగా వచ్చింది.

"ఏమిటి చెప్పమంటారు?" అని వెంకట్రావు నడిగివుంటుంది. అందుకే జవాబు రావడం ఆలస్యమవుతోంది.

ఇంతలోనే, కంటికి కనిపించని బంగారు తీగెల్తో అల్లుకున్నాయి మాటలు.

"ఊరికి వెళ్ళేరండీ!"

అబద్ధం! అబద్ధం!

అబద్ధం చెప్పి నవ్వుతోందా?!

నవ్వు ఆపుకొంటున్నట్టుగా ఉందే!!

నవ్వుతూ అబద్ధాలాడే ఈవిడ ఎలా ఉంటుందో! ఎలా ఉంటుంది? నాకు తెలుసు!! మేనకలా ఉంటుంది. రవివర్మ బొమ్మ చూసేను కదూ! అలాగే సరిగ్గా అలాగే ఉంటుంది. మెత్తటి పరుపుమీద తెల్లచీర కట్టుకొని తమలపాకులు నముల్తూ కూర్చొనుంటుంది. ఆమె అందాన్ని కళ్లతో తాగుతూ, చేతుల్తో తాకుతూ పక్కనే వెంకట్రావు! అదృష్టవంతుడు! ఇద్దరూ హాయిగా ఉండగా మధ్య పానకంలో పుడకలా నా కర్కశ కంఠం. విసు

కుక్కుంటూ "ఎక్కడకో వెళ్ళేరు" అనేసింది మామూలుగా. "ఎక్కడకెళ్ళేరు" అని నే నడుగుతానని అనుకొనివుండదు. విసుక్కోదూ, పాపం, మరి! అనవసరంగా చిరాకు కలిగించే నావిడకి. నే నెప్పుడూ ఇంతే! కాని ఏం చేసేది? అడక్క తప్పదే మరి.

తెల్లటి చీరతో నల్లటి కురుల్తో, మృదువైన వంపులు తిరిగిన వళ్ళంతా వెంకట్రావుకి ఆమె అప్పజెప్తూ ఉండగా తను వేసిన "వెధవ ప్రశ్న"కి తన కళ్ళెదుట ఆమె విసుక్కుంటున్నట్టు తోచింది సుబ్బయ్యకి.

'నోరు జారేక ఏం చేస్తాం' అనుకున్నాడు.

జవాబు చెప్పడానికి అతని సలహా అడిగింది. కళ్ళల్లో పడుతూన్న ఆమె పొడుగాటి జుత్తు ఓ పక్కకి తోస్తూ "ఊళ్ళో లేనని చెప్పి తోలేద్దూ" అనుంటాడు వెంకట్రావు. సలహా విని "అంత అబద్ధం ఆడమంటారా" అని నవ్వుతూ అతణ్ని ముద్దులాడింది.

ముద్దాడుతూ నవ్వింది!

నవ్వాపుకొంటూ ఆమాట అందజేసింది.

"ఊరికి వెళ్ళేరండి!"

ఉప్పెనగా వస్తూన్న నవ్వు ఆపుకొందికి తెగ ప్రయత్నం చేస్తోంది, అనుకున్నాడు సుబ్బయ్య.

ఆడవాళ్ళ హేళనకి మొగవాళ్ళకు కలిగే బాధ సుబ్బయ్యకూ కూడా కలిగింది.

ఉదయం తొమ్మిదిగంటలకి ఎండ చురుగ్గా ఉన్నది. సందులోకి జర్ మని చప్పుడు చేస్తూ 'జీప్' ఒకటి తిరిగింది. 'జర్'మని చప్పుడు చేసుకొంటూ పోయింది. పక్కింట్లో ఎవడో పిల్లడు ఏడుస్తున్నాడు. ఎదటింట్లో ఎవరో యాభయ్యేళ్ళ వితంతువు పెద్దనిమిదేళ్ళ కన్యతో కూరగాయలబేరం చేస్తోంది. చేసి ఇంట్లోకి వెళ్ళింది. కూరగాయలమ్మే పిల్ల తట్టసర్దుకొని సుబ్బయ్యవైపు సూటిగా చూసింది.

"నన్నో వెర్రివెధవని చేసి నవ్వుకుంటున్నారు" అని బాధపడ్డాడు సుబ్బయ్య.

ఎండ చురచురమంటోంది. పక్కింట్లో పిల్లడు ఏడుపు ఆపేసి ఒక్కసారిగా నవ్వడం ప్రారంభించేడు.

"నవ్వుతున్నారు నన్ను చూసి."

కూరలమ్మే కన్య సుబ్బయ్యవైపు చూస్తోంది సూటిగా. సుబ్బయ్య ఆ పిల్లవైపు చూసేడు, కాని ఆమె ముఖం వికృతంగా ఉందనిగాని, ఆమె శరీరం యవ్వనపు బిగిలో ఆకర్షణీయంగా ఉందనిగాని చూడలేదు.

"ఇదికూడా నన్ను చూసి నవ్వుతోందా?" అని చూసేడు.

కూరలు కొనిపించడానికి 'ప్రిలిమినరీ'గా ఆమె సుబ్బయ్యని చూసి చిన్న చిరునవ్వు పారేసింది.

"ఇదికూడా నవ్వుతోంది!"

అంతా నవ్వుతున్నారు!

నన్ను చూసి అంతా నవ్వుతున్నారు.

నన్నో వెర్రివెధవని చేసి అంతా నన్ను చూసి నవ్వాపుకోలేకుండా ఉన్నారు.

పోతాను. ఇంటికి పోతాను.

మెల్లిగా ఇంటికి నడక సాగించేడు సుబ్బయ్య. రెండుమైళ్లు నడిచివచ్చేడు. రెండుమైళ్ళు నడిచి వెళ్తున్నాడు. రెండవసారి ఆరోజు అలా వెళ్ళడం.

రెండవపర్యాయం ఇంటికి పోతున్నప్పుడు మూడోసారి మళ్ళీవద్దామనే కృతనిశ్చయంతో వెళ్ళేడు, సుబ్బయ్య.

ఊళ్ళోనే, ఇంట్లోనే ఉండి లేడనిపించుకొంటున్నాడు వెంకట్రావు.

నన్ను గుమ్మంలోంచే గెంటేస్తున్నాడు.

కొంపతీసి దగాచెయ్యడు కద ?!

దగాచేసేడంటే చస్తాను.

బాబోయ్! చస్తాను!

ఇవాళ ఎలాగయినాసరే అతణ్ణి కలుసుకోవాలి.

లేకపోతే కొంపమునుగుతుంది.

ఆఫీసులో ఆరోజు.

"ఏమయ్యా, సుబ్బయ్యా! ఒంట్లో బాగులేదా ?" అని రామస్వామి అడిగేడు.

"అబ్బెబ్బే! లేదండీ! బాగానే ఉంది."

గవరయ్య వచ్చి వెళిపోయేడు.

సుబ్బయ్యవైపు చూడనే లేదు.

సుబ్బయ్య వంట్లో గాభరాగా ఉంది. జ్వరం లేకపోయినా వళ్ళంత్రా వేడిగా ఉంది. కాయితాలు మడత పెట్టబోతూవుంటే చేతులు వణికేయి. కలంతో రాయబోతే వేళ్ళు టొంకర్లుపోయేయి.

కొంపతీసి దగాచెయ్యడు కద !!

పక్కనే కూర్చొన్న టైపిష్టు ఎడతెరిపి లేకుండా టైపు కొడుతున్నాడు.

టప్‌టప్ టపటప్ టపటపఫటప్, టప్‌టప్ టపటప్.

ఛస్తాను, ఛస్తాను.

చచ్చేదాకా చావు బాజాలాగ వీడు పైపు కొడుతూనే ఉంటాడు కాబోలు.

హబ్బబ్బా! వెధవబాధ! ఛస్తున్నాను.

"అన్నిటికన్నా ముందు ఈ ఉత్తరం పంపించెయ్ మన్నారు దొరగారు" అని ఆఫీస్ ప్యూన్ వెంకన్న ఓ ఉత్తరం పట్టుకొచ్చేడు.

"ఏదయ్యా సుబ్బన్నా ఓ సిగరెట్టిలా ఇచ్చుకో" అన్నాడు అవధాని.

పైపిట్టు బాదేస్తూనే ఉన్నాడు.

'పోర్టికో'లో కూర్చున్న పీచుజుత్తు డ్రైవరు బీడీకి ఆఖరి పీల్పిచ్చేడు.

రామస్వామి ఆరోజుకి యాభైరెండోసారి పొడుం పీల్చేడు.

చస్తాను, దగాచేస్తే!

వెంకట్రావు నెలాగైనా కలుసుకోవాలి.

కలుసుకొని సంగతేదో తేల్చుకోవాలి.

తగుమనిషి తరహాగా లేదు వెంకట్రావు ప్రవర్తన.

ఏహేమీ తగుమనిషి తరహాగా లేదు.

ఇంట్లోఉండే ఆవిడచేత అబద్ధాలాడించేడు.

(ఎంత ఇంపుగా చెప్పింది!! పాపం, ఆవిడ తప్పేమీ లేదు.)

వ్యవహారం చూస్తే ఏమీ బావుండడం లేదు.

ముఖాముఖీ మాట్లాడి వ్యవహారం ఫైసలు చెయ్యాలి.

ఇంట్లో లేడంటే ఈసారి తలుపు తియ్యమంటాను, అనుకొని ఆరాత్రి ఇంటినుంచి బయల్దేరేడు సుబ్బయ్య.

మెయిన్‌రోడ్డులోంచి ఆరాత్రి ఎనిమిదిగంటల సమయంలో సందులోకి వస్తూనే అరుగుమీద కూర్చొన్న వెంకట్రావుని చూసి ఇంట్లో ఉన్నాడు కదా అని సంతోషించేడు సుబ్బయ్య.

"హమ్మయ్య!" అని నిట్టూర్చేడు.

ఊరికీ వెళ్ళలేదు. గిరికీ వెళ్ళలేదు. నేను మొదట్నించీ అనుకొంటూనే ఉన్నాను అని సంతోషించడమే కాకుండా గర్వించేడు.

అంత పచ్చిఅబద్ధాలు, (మధ్యని పాపం ఆ మేనకచేత), చెప్పించినందుకు వెంకట్రావు కొంచెం సిగ్గుపడి తనతో మాట్లాడ్డానికి మొహమాట పడతాడేమో అనుకున్నాడు. అందుచేత అడుగు జోరుగా వేసేడు. సిగరెట్టొకటి తీసి అక్కడే వెలిగించేడు. చిన్న చిరునవ్వు నవ్వే ననుకొన్నాడు. అరుగుమీద కూర్చున్నాడు.

సుబ్బయ్యవచ్చినందుకు వెంకట్రావు సంతోషం ప్రకటించలేదు. రమ్మని ఆహ్వానించలేదు. రాకకి కారణం అడగలేదు. "ఎప్పుడూ ఈమధ్య కనిపించలేదే! ఏమిటి విశేషాలు?" అనే మామూలు మాటలైనా అనలేదు.

రెండోమనిషి లేనట్టుగా, ఎటో చూస్తూ చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు కాలుమీద కాలు వేసుకొని.

సుబ్బయ్య సంతోషం చచ్చిపోయింది.

గర్వం అణగారిపోయింది.

సిగరెట్టు ఆరిపోయింది.

వెంకట్రావు చుట్ట తెగజోరుగా వెలుగుతోంది.

ఆరోజు రాత్రి ఎనిమిదిగంటల అయిదు నిమిషాల సమయంలో, సుబ్బయ్య సిగరెట్టు ఆరింది.

వెంకట్రావు పొగచుట్ట వెలిగింది.

ధీమాగా కాల్తూన్న పొగచుట్టలాగ వెంకట్రావు ధీమాగా కూర్చొని ఉండగా సుబ్బయ్య సంతోషం వెలుగు వెలిగి ఆర్పు ఆరింది.

సుబ్బయ్య ఎందుకొచ్చేడో వెంకట్రావుకి తెలుసు.

వెంకట్రావుకి తెలుసునని సుబ్బయ్యకి తెలుసు.

తనకి తెలుసునని సుబ్బయ్యకి తెలుసునని వెంకట్రావుకి తెలుసు.

అది సుబ్బయ్యకి తెలుసు.........

తెలిసిన ఇద్దరూ తెలియనట్టుగా కూర్చున్నారు.

సుబ్బయ్య కంగారుపడుతున్నాడు. గాభరాపడుతున్నాడు. ఆందోళనపడుతున్నాడు. బెంగపెట్టుకుంటున్నాడు. బాధపడుతున్నాడు. భయపడుతున్నాడు.

దగా చెయ్యడుకద! దగా చెయ్యడుకద!!
వెంకట్రావు దగాచెయ్యడుకద!!!
"అయ్యయ్యో! చేస్తాడయ్యా చేస్తాడు!!
వెంకట్రావు దగా చేస్తాడు!!!"

అని ఎవరో చాటుతున్నారు.

డప్పులు కొట్టించేరు. బాజాలు వాయించేరు. భీషణ శంఖాలు పూరించేరు. భీకరగర్జన గర్జించేరు. మదగజంలా ఘీంకారం చేసేరు.

అన్నీ చేసి చెప్పేరు! చెప్పేశారు!! చెప్పి పారేశారు!!!

వెంకట్రావు తప్పక దగా చేస్తాడు!!!!

వెంకట్రావు చెయ్యకపోతే ఇంకెవరు చేస్తారు???

సుబ్బయ్యా! చూస్తావుకదూ!

వెంకట్రావు చేస్తాడుకదా!

చూస్తావుగదా!

అతనిదగా!

తడిలేని గొంతుకతో రెండు పొడి ముక్కలు మాట్లాడేడు సుబ్బయ్య.

"ఇదిగో, ఒచ్చేను"

"అవును, చూసేను"

ఇంకేమనడం? భోగట్టా ఎలా ఎత్తడం? లోపల్నించి మేనక వింటోందో ఏమిటో! ఇతణ్ణి డబ్బడుగుతే ఆవిడ బెంగ పెట్టుకుంటుందో ఏమో! ఇతనియందు మక్కువతో ఉంది. నన్ను తిడుతుంది. ఏడుస్తుంది. ఆ ఉసురంతా నాకు తగుల్తుంది.

ఛాఛా!

ఆమె ఉసురు నాకు తగల్డమేఁవిఁటి! అసందర్భం! కాని ఎలా అడగడం? ఏమనడం?

"ఊరికి వెళ్ళేవన్నారు, ఇందాట్లా వస్తే"

అయ్యయ్యో! నేరకపోయి అనేశాను! ఆవిడ నొచ్చుకొంటుందికద!

"ఆహాఁ! అయితే?"

ఏమీ లేదు.

"అయితే?"

"ఏమీ లేదు! ఊరికెళ్ళేవన్నారని ఊరికే అన్నాను" ఊరుకోకుండా!

మధ్యాహ్నపు మండుటెండలో కాలిన అరుగు, రాత్రయినా ఇంకా కాల్తూనే ఉంది.

కూర్చుందికి ఎంతమాత్రం సుఖంగా లేదు.

ఎంతసేపు ఇలా కూర్చోడం?

నేనొచ్చిన పనేమిటి?

నన్ను రమ్మన్నాడే ఆరోజు బజార్లో కనపడినప్పుడు!

మరి ఇప్పుడు మాట్లాడ్డేం?

మాట్లాడ్డే!!

నేనే మాట్లాడాలి.

అవసరం వచ్చినప్పుడు అడక్కపోతే లంపటమంతా నా మెడకి చుట్టుకొంటుంది.

చచ్చేన్రా, భగవంతుడా,

"చెల్లెమ్మా, చిన్నపిల్లలూ నీకోసం కాసుకూర్చుంటారోయ్! లేటవుతూందీ!"

వెంకట్రావు లేచి నిల్చున్నాడు.

అయ్యయ్యో! వెళిపోతున్నాడు ఇంట్లోకి!

"ఇదిగో, చూడు చూడు. ఆ విషయంగురించి వచ్చేనోయ్"

"ఏ విషయం?"

"అదేనోయ్! ఆవిషయం! మొన్న...ఈమధ్య...ఆరోజు ఇచ్చేస్తానన్నావు కదూ?"

"ఎన్నిసార్లు చెప్పినా నీ నసుగుడు మానవు! ఏమిటో అనుకున్నాను. స్పష్టంగా చెప్పకూడదూ ఆ సంగతేనని. అయితే ఇంతకీ ఏమంటా విప్పాడు?"

"వాడు తొందరచేస్తున్నాడు"

"ఆ వెధవ తొందరచేస్తే దేవేంద్రుడు తొందరచేసినట్టు చెప్తున్నావేమిటి!?

"కాదోయ్ బాబూ! నన్నొదలకుండా ఉన్నాడోయ్"

"ఒదలకపోతే తొక్కలొల్చేయ్"

"అతనే నావి ఒల్చేస్తానంటున్నాడు"

"నీ అనువుచూసి ఏమైనా అంటాడా వెధవ! ...అయినా అయామ్ సారీ! అరనిమిషంలో ఇప్పుడు ఎక్కణ్ణించి తెస్తాను! నాల్రోజు లాగమను"

"ఆగనంటున్నాడు! ఏమిటిసాధనం?"

"ఆక్కపోతే చావమను, ఉరేసుకొని. ఆక్కపోతే ఇవ్వనే ఇవ్వనని చెప్పు. దిక్కున్నవాడితో చెప్పుకోమను."

అయ్యయ్యో! అనుకున్నట్టుగానే చేస్తున్నాడే!

"మరింక నువ్వు ఇంటికి వెళ్ళు"

వెళ్ళేడు, పోయేడు, వెళ్ళిపోయేడు.

వెళ్ళగానే అడుగుతుంది మేనక.

"పోయేడా లేదా" అని.

"పోయేడు"

"హమ్మయ్య" అని అతనిచుట్టూ మెత్తటి చేతులు వేసి కౌగలించుకొంటుంది.

హబ్బా! నాకు బాధగా ఉంది.

కాని చేసేదేముంది?

ఇంక పోవాలి. ఇంటికి పోవాలి.

కథల్లో కష్టాలుపడే సినీమా హీరోలాగ నడుచుకొంటూ ఆరాత్రి వెళ్ళేడు సుబ్బయ్య.

"నా దగ్గిర డబ్బుంటే ఇచ్చెయ్యనూ! లేన్దే ఏంచెయ్యడం? అయినా, అంత సపవలా ఉంటే ఎలా? కాస్త గట్టిగా ఆ వెధవతో కొన్నాళ్ళపాటు ఆగితే ఆగు. లేకపోతే నీకు డబ్బూ ఇవ్వను. గాడిద గుడ్డూ ఇవ్వను. దిక్కున్నావాడితో చెప్పుకో అంటే వాడు చచ్చినట్టు నోరుమూసుకుంటాడు. మా బావ ఒట్టి వంగిరి పింగిరి గాడు. అందులోనూ గవరయ్యగాణ్ణి చూస్తే ఎందుకో భయం! ఛీ" అని ఇంట్లో వెంకట్రావు విసుక్కున్నాడు.

(సశేషం)